## పశ్చాత్తాప ప్రార్థన

**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా  పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష  నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపమలన్నిటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2009-11, Dt.07-01-2009



మెహెర్‌బాబా అక్టోబరు 2010

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :10 సంచిక: 06 హైదరాబాద్ 2010 అక్టోబరు పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# న్యూ ఢిల్లీలో ప్రేమిక సహవాస్

## 2010 డిశంబరు 1,2,3, తేదీలలో

ఢిల్లీలో మెహెర్‌బాబా 1952 డిశంబర్ 1,2,3 తేదీలలో ప్రజా దర్శనం ఇచ్చారు. ఆనాడు ఎందరో మెహెర్‌బాబాను దర్శించుకుని ఆయన్నుండి ప్రసాదం అందుకున్నారు. ఆ పుణ్య దినాలను పురస్కరించుకుని ప్రతి ఏటా మూడ్రోజులపాటు మెహెర్ ప్రేమిక సహవాస్‌ను న్యూఢిల్లీ బాబా సెంటర్‌వారు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ ఏడాది కూడా డిశంబరు 1,2,3 తేదీలలో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా సెంటర్ కార్యదర్శి శ్రీ మనోజ్ సేథీ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ మనోజ్ సేథీ, 09810123853, ఫ్యాక్స్-011-43169001 సంప్రదించగలరు.

# ఝాన్సీలో ప్రేమిక సహవాస్

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఝాన్సీ పట్టణంలో ప్రేమిక సహవాస్ 2010 నవంబరు 28,29 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ రాజేంద్ర మెహెర్ శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు తప్పక హాజరుకావల్సిందిగా ఆయన కోరుతున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్- 0510- 2473114, 09451333705 సంప్రదించగలరు.

# హెల్ప్‌లైన్

మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040-27964050, 9441218841,** శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- **94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.

# మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రము,రామచంద్రపురం

## 9వ వార్షికోత్సవము

మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రము 9వ వార్షికోత్సవము 07.11.2010 ఆదివారము ఉదయం 6 గంటల నుండి 1 గంటవరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ బాలగోపాల భాస్కరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 9492604290, 9492228522 సంప్రదించగలరు.





# బాబా సందేశం

**అందరితో మంచిగా వుండు. నేను ఎల్లప్పుడు నీతోనే వుంటాను. -మెహెర్‌బాబా**

**Be good to others and I am always with you.**

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. కేశవ్ నారాయణ నిగం | 6-11 |
| 3. హేలాపురి | 12-17 |
| 4. ఆధ్యాత్మిక జ్ఞాన్ | 18-19 |
| 5 లార్డ్ మెహెర్ | 20-27 |
| 6. తిరిన చిన్ని కోరిక | 30 |
| 7. దసరా మెగాటూర్ | 31 |
| 8. మా మాటలు | 32-35 |
| 10. బాటసారులు | 36-37 |
| 11. జీవిత సభ్యులు | 38 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# వారణాశిలో రెండ్రోజుల ప్రేమిక సహవాస్

## 2010 నవంబరు 14, 15

బెనారస్‌లో పవిత్ర గంగా నదీ తీరాన గల వారణాసిలో మెహెర్‌బాబా నవజీవనంలో భాగంగా తన మండలి వారితో పర్యటించిన విషయం పాఠకులకు తెలుసు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారణాశిలో రెండ్రోజుల ప్రేమిక సహవాస్ నవజీవన్ పాదత్ర - సహవాస్ ఏర్పాటు చేసినట్లు స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు.

ఆసక్తిగల వారు తమ వివరాలను శ్రీ కె.కె. శ్రీవాత్సవ (094151-90065) లేదా శ్రీ మెహెర్ శర్మ (094107- 05900) సంప్రదించగలరు.

## అనంతపురం సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం

2010 అక్టోబర్ 23, 24 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి, శ్రీ కృష్ణమూర్తి (094905-38799) ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశం గల బాబా ప్రేమికులు తప్పక హాజరుకాగలరు.

# విజయనగరం సెంటర్ 30వ వార్షికోత్సవం

విజయనగరం సెంటర్ 30వ వార్షికోత్సవం 30.10.2010 ఉదయం 6 నుండి 1.30 వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ సి.వై. చింతామణి (94419-09847) తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ కె.హెచ్.కె.ప్రసాద్ మరియు శ్రీమతి శారద ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారు. శ్రీ కె.వెంకట్‌రావు, శ్రీ ప్రసన్న కుమార్ ఉపన్యాసకులుగాను, శ్రీ బాణేశ్వరరావు కార్యక్రమ నిర్వాహకులుగా హాజరవుతారని శ్రీ చింతామణి తెలిపారు.

# శ్రీకాకుళం సెంటర్ స్వర్ణోత్సవాలు

## 2011- ఆగస్టు 13,14 తేదీలలో

2011 నాటికి శ్రీకాకుళం సెంటర్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు కార్యదర్శి శ్రీ పి. రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సావనీర్ నొకదాన్ని ప్రత్యేకంగా ప్రచురిస్తున్నట్లు ఆయన తెలిపారు.





సంపాదకీయం

# ఆలోచించండి

మనలో చాలా మంది సాధు సజ్జనులను దర్శించుకోవడానికి ఇష్టపడతారు. గుళ్ళూ గోపురాలు కనబడగానే భక్తితో రెండు చేతూలూ జోడిస్తూ, కళ్ళు మూసేసుకుంటారు. ఏతావాతా చెప్పుబోయేదేమంటే మనకు దైవభక్తి మెండు. దైవారాధన పాళ్ళూ ఆధికమే. మంచిదే కదా అనుకోవచ్చు. కానీ, బహు దేవతారాధన మంచిది కాదంటారు మెహెర్‌బాబా. దీనివల్ల భగవంతునిపై గురి తప్పుతుందన్నారు. మానవుని లక్ష్యం భగవంతుని చేరడమే కదా. ఈ లక్ష్యం మరింత జాప్యమౌతుందని మెహెర్‌బాబా స్పష్టం చేసారు. బహు దేవతారాధన కూడదని బాబా ఖండించారు.

ఓ సందర్భంలో ఈ విషయాన్నే ఇలా సున్నితంగా వివరించారు.

భగవద్వేషణ మార్గాన్ని మంచి నీళ్లబావి త్రవ్వటంతో పోల్చవచ్చన్నారు. మంచినీళ్ల బావినో, బోరు బావినో త్రవ్వే ముందు, ఎక్కడ నీళ్ళు పడతాయో, జాగ్రత్తగా గమనించి, అప్పుడే, త్రవ్వటం మొదలుపెడతాం. అంతేకానీ, కాసేపు ఇక్కడ, ఇంకాసేపు అక్కడ అంటూ ఎక్కడ పడితే అక్కడ త్రవ్వుతూ పోతే వొళ్ళు హూనం అవుతుంది తప్ప నీళ్లు పడవు. ఏదో ఒకచోట స్థిరంగా వుండి, త్రవ్వుతూ పోతే, ఈ వేళ కాకపోతే రేపయినా నీళ్ళు పడతాయి. అయ్యో, నీళ్ళు పడలేదని కృంగిపోయినా, నాలుగుచోట్లకి పరుగెత్తినా ఫలితం శూన్యం. మనిషికి ధైర్యం కావాలి. పట్టిన పట్టు వదలు కూడదు.

అలాగే, భగవంతుడి విషయంలో కూడా. ఈ స్వామి, ఆ సాధువు, ఆ గురువు, ఈ సద్గురువు అంటూ పరిగెడితే లాభం వుండదు. ఎవరో ఒక గురువుని ఆశ్రయించు. ఆయన ఇచ్చ ప్రకారం చేయి. అలా చేస్తూపోతే గమ్యం చేరతావు. త్రవ్వగా త్రవ్వగా బావిలో నీళ్ళు పడ్డట్టు, గురువు సేవలో తరిస్తే, వో రోజున భగవత్ దర్శనం తప్పక లభిస్తుంది అని అన్నారు. మరో సందర్భంలో, చక్రవర్తితోనే పరిచయమున్నవారికి కోటలోకి వెళ్ళేందుకు, గుమ్మం దగ్గర వుండే సిపాయిల సిఫారుసు అవసరమా? అని చమత్కరించారు.

**"Those who know the Emperor have no need to bow before the palace guards in order to gain entrance " - Meher Baba.**

**ఆలోచించండి. తగిన నిర్ణయం తీసుకోవల్సింది.** ✿

(గత సంచిక తరువాయి) స్వీయ చరిత్ర - ధారావాహికం

# మెహెర్‌బాబాతో నా జీవిత యాత్ర
# (My Life story with Meher Baba)




- కేశవ్ నారాయణ్ నిగం

హమీర్‌పూర్ (ఉ.ప్ర)

## క్రొత్త జీవితం

ఆ మాదిరిగా 1948 జూన్ 21 నుండి జూలై 20 దాకా బాబావారి ఆజ్ఞలను అత్యంత విధేయతతో పాటించాను. 1948 జూలై 26న నా భార్యాపిల్లలు నౌరంగాకు వచ్చారు. ఆ దరిమలా, నా భార్య ఆరోగ్యం పాడయ్యింది. స్థానిక పెద్దాసుపత్రి డాక్టర్లు ఎంత చికిత్స చేసినా, ఆమె ఆరోగ్యం కుదట పడలేదు. ఇక కష్టం అని తేల్చి చెప్పేశారు. ఆ సమయంలో నాకు మరో మార్గం ఏమీ లేక, 'అన్యధాశరణం నాస్తి' అని నా దగ్గరున్న 'అవతార్' పుస్తకం అట్టపైనున్న బాబా ఫోటో చూపించి, ఇదిగో ఈయన భగవంతుడు- మెహెర్‌బాబా. ఈయన్ని ధ్యానించుతూ- ప్రశాంతంగా వుండమన్నాను. బాబా చిత్రంతో వున్న 'అవతార్' పుస్తకాన్ని ఆమె తలగడ క్రింద వుంచాను. అంతా బాబాదయ అనుకోవాలి. ఓ వారం పదిరోజుల్లో ఆమె ఆరోగ్యవంతురాలైంది. అప్పటినుండే నా భార్య కూడా అవతార్ మెహెర్‌బాబాను ఆరాధించడం మొదలెట్టిందనాలి. ఇదిలా వుంటే, ఓ రోజున జీన్ ఆడ్రియల్ రాసిన 'అవతార్' పుస్తకాన్ని హిందీలో అనువదించాలని నా మనస్సులో అనుకున్నాను. ఆ తర్వాత ఈ మేరకు ఆరు పేజీల సవివరమైన లేఖను రాసి, 1948, ఆగస్టు 19, రక్షాబంధనం రోజున మెహెర్‌బాబాకు, రచయిత జీన్ ఆడ్రియల్‌కు పోస్టు చేశాను. మెహెర్‌బాబా తన అనుమతిని ఆది కె.ఇరానీ చేత ఇప్పించారు. అప్పట్లో రచయిత జీన్ ఆడ్రియల్, మెహెరాబాద్‌లో వుండేవారు. రచయిత కూడా (1948 సెప్టెంబరు 2న) తమ అభినందనలతో అనుమతి ఇచ్చారు. ఆ మాదిరిగా అవతార్ గ్రంధాన్ని హిందీ అనువాదం 1948 సెప్టెంబరులో చేపట్టి 1949 మే 26 నాటికి రాత్రింపగళ్ళు కష్టపడి పూర్తి చేశాను. ఆ తర్వాత, ఈ అనువాదాన్ని హమీర్‌పూర్ నుంచి ప్రచురించే 'పుకార్' పత్రికలో ధారావాహిక సీరియల్‌గా 1955 సెప్టెంబరు నుండి 1959 సెప్టెంబరు దాకా





ప్రచురించాము. ఆ రోజుల్లో రాష్ట్ర రాజదాని నౌరంగా నుంచి రేవాకు మార్చారు. (1948 సెప్టెంబరు 2న). నా కార్యాలయం, మకాం కూడా రేవాకు మార్చవల్సి వచ్చింది. నేను 'అవతార్' గ్రంధాన్ని హిందీలో అనువదిస్తుండగా చదివినవారు, వీరూ వారూ పలువురు నా ద్వారా బాబా నామం వారి చేవులను తాకింది. బాబావారి వారి కృప నా యావత్తు కుటుంబసభ్యులపై వుందనిపించింది. బాబా నజర్ వల్ల అప్పుడప్పుడు వచ్చిన చిన్నా చితక సమస్యలు తీరినాయి. బాబా పట్ల నా నమ్మకం, నా కుటుంబల అందరికీ బాబాపై నమ్మకం మరింత ప్రగాఢమయింది. క్రమేణా నా స్నేహితులందరూ కూడా బాబా పరిధిలోని వచ్చారు.

## COSMIC MEHER FAMILY

బాబా ప్రేమికులందరూ కుల, మత, వర్గ విభేధాలు లేకుండా ఏకైక వసుధైక కుటుంబంగా వుంటుందని, అందుకు నేను COSMIC MEHER FAMILY లేదా మెహెర్ బ్రహ్మ పరివార్ పేరిట నామకరణం చేశాను. నా ఆలోచల్ని బాబాకు ఒక లేఖ ద్వారా తెలియజేశాను.

ఈ వసుధైక కుటుంబంలో సభ్యుల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరిగింది. హమీర్‌పూర్‌లోని నా మిత్రులందరూ ఈ నూతన కుటుంబంలో సభ్యులుగా చేరారు. ఐతే, నా ప్రియమిత్రుడు, నా చిరకాల రాజకీయ స్నేహితుడు 'పుకార్' మాత్రం ఇందుకు మినహాయింపు అనాలి. అంతేకాదు, నన్ను రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలనీ, తిరిగి హమీర్‌పూర్‌కు రావాలనీ నన్ను ఆహ్వానించాడు. మెహెర్‌బాబా కార్యక్రమాలకు దూరంగా వుండమనీ ప్రేమతో అనేక లేఖలు రాశాడాయన. ఐతే, ఆ లేఖలు నాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నా మనస్సు అవతారునిపై పూర్తిగా లగ్నమైంది. ప్రస్తుతం రాజకీయాలు నా దృష్టిలో నిరర్ధకమైనవిగా వున్నాయి. నా మనస్సులోని భావాలనే జవాబుగా పుకార్‌జీకి లేఖలు రాశాను. అవతారునివైపు ఆరర్షితుడనై దిశా నిర్దేశం చేసుకున్న నన్ను తన మాటలతో పుకార్‌జీ ఆకర్షించలేక పోయాడు.

## సమాచార శాఖకు క్రొత్త అధికారి.

అంతా బాగుందనుకున్న సమయంలో క్రొత్తగా ఏర్పడిన వింధ్య ప్రదేశ్ రాష్ట్రానికి, అక్కడి ఉన్నతాధికారులకు సంబంధించిన ఓ వ్యక్తిని తీసుకొచ్చి, రాష్ట్ర సమాచార శాఖకు క్రొత్తగా డైరక్టర్‌గా నా స్థానంలో పోస్టు చేశారు. నన్ను Assistant Director గా నియమించారు. (1948 ఆగస్టు 22).

ఇది నన్నెంతో బాధించింది. నాకు పుండు మీద కారం చల్లినట్లైంది. ఉద్యోగానికి రాజీనామా చేయాలనుకున్నాను. ఈ విషయాన్నే బాబాకు తెలియజేస్తే, ఆదీ ద్వారా-

అంతా నా ఇచ్చ ప్రకారమే జరుగుతోందని, నీ విధులు సక్రమంగా నిర్వర్తించమని" బాబా ఆదీ చేత లేఖ రాయించారు.

క్రొత్తగా జాయినయిన డైరక్టర్‌కు - నేనంటే వల్లమాలిన అక్కసుతో- చెప్పరాని మాటలు- పితూరీలు- నాపై అధికారులకు చెప్పాడు. నాతో కఠినంగా వ్యవహరిస్తుండేవాడు. ఈ అధికార పోస్టుల మార్పిడివల్ల బాబా నాలో అహంకార భావాన్ని నశింపజేసి, ఓర్పు, సహనం మెండుగా ప్రసాదించి నన్ను ఆధ్యాత్మిక మార్గంవైపు పయనించేలా చేశాడు. బాబా సేవా కార్యక్రమాల ముందు అధికారిక హొదాలు, రాజకీయ పదవులు అత్యల్పం అని తెలుసుకునేలా చేశాడు. అందరూ సహజంగా చాలా గొప్పదిగా భావించే గొప్ప విషయాలన్నీ క్రమేపీ నాకు సర్వసాధారణమైన విషయాలయ్యాయి.

## అది 1949వ సంవత్సరం.

1949 జనవరి ఒకటవ తేదీన మెహెర్‌బాబా దగ్గర్నుంచి ఒక సర్కులర్ వచ్చింది. ఆ సర్కులర్‌లో ఏముందంటే, ఆ ఏడాది ఆధ్యాత్మికంగా చాలా క్లిష్టమైందిగా మెహెర్‌బాబా పేర్కొన్నారు. తన ప్రేమికులందర్నీ స్వార్థం విడనాడి, ఎంతటి విషయాలనైనా త్యాగం చేయడానికి సిద్దంగా వుండమన్నారు. మాయా మోహపూరిత ప్రలోభాలకు లోబడకుండా, భగవధ్యానంలో అధిక సమయం గడపమని కోరారు. రాజకీయాలకు, రాజకీయ చర్చలు- వాదోపవాదాలకు దూరంగా వుండమనీ బాబా ఆదేశించారు. జూలై నెల ఒకటో తేదీనుండీ సంపూర్ణ మౌనం పాటించమన్నారు. అంతేకాదు ఫిబ్రవరి ఒకటోతేదీ నుండి డిశంబరు దాకా వేరెవ్వరితో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయరాదని బాబా నిషేదాజ్ఞలు జారీ చేశారు. బాబావారి ఈ ఆదేశాలున్న ఈ సర్క్యులర్ నాడు 1949 జనవరి 3న పోస్టులో అందింది. వెంటనే ఆ సర్క్యులర్‌ని హిందీలోకి అనువదించి, కొన్ని వందల సంఖ్యలో కాపీలు అచ్చు వేయించి- రేవా, హమీర్‌పూర్‌లలో నేను ఎరిగిన వారందరికీ పంచిపెట్టాను. నాపై అధికారి 'టాండన్'కు నేను బాబా భక్తుడినని తెలుసుకున్నాడు. బాబా సర్క్యులర్ అతనికీ ఇచ్చాను. ఏ కారణమో తెలియదుకానీ, చాలా కాలంగా నన్ను ద్వేషిస్తూ వున్న టాండన్- క్రమేణా నాతో ప్రేమగా పలకరించడం మొదలెట్టాడు. నా సలహాలు- కోరుతున్నాడు. జీన్ ఆడ్రియల్ రాసిన 'అవతార్' పుస్తకం అడిగి తీసుకున్నాడు. బాబా కార్యక్రమాలలో భాగంగా 1949 ఫిబ్రవరి 25, బాబావారి 55వ జన్మదినోత్సవం జరుపుతుంటే ఆ కార్యక్రమానికి హజరయ్యాడు. బాబా గురించి నేను చేసిన ఉపన్యాసం బాగుందని ప్రశంశించాడు. ఇదిలావుంటే 1949 ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి ఎవరితోనూ ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు నెరపరాదని బాబావారి ఆదేశాలున్నాయి కదా ! ఆ మేరకు నా రాజకీయ మిత్రులెవరికీ ఉత్తరాలు రాయడం





మానివేశాను. దీనితో సమయం వృధాకాకుండా కలిసివచ్చింది. ఆ తీరిక సమయంలో బాబా కార్యక్రమాలలో నామజపంలో ఎక్కువ భాగం గడపగలిగాను. నేను పనిచేస్తున్న సమాచార శాఖను 1949 ఏప్రిల్ ఒకటో తేదినుంచి ప్రభుత్వం రద్దు చేశింది. నేను తిరిగి స్వగ్రామం వెళ్ళాలనుకున్నా - స్థానిక ఉన్నతాధికారులు నా కోసం ప్రయత్నించి, ఆఫీసర్ - ఆన్- స్పెషల్ డ్యూటీగా ఏర్పాటుయిన క్రొత్త పోస్టులో నాకు ఉద్యోగం ఇప్పించారు. ఆ తర్వాత బాబా ఆదేశానుసారం నేను- నా భార్య, మా స్నేహితులు శ్రీ పిళ్ళై కుటుంబీకులు- జూలై ఒకటో తేదీ నుంచి మౌనం పాటించడం ప్రారంభించాం. మౌనంలో వుంటూనే ఆఫీసు పనులకు హజరయ్యాను. కోర్టు సమన్లు వుంటే వాటికి హాజరయాను. మౌనంగానే దూరప్రాంతాలకు రైల్లో ప్రయాణించాను. నా అధికార కార్యక్రమాలకు, నా విధుల నిర్వహణలో నేను చేపట్టిన మౌనం అడ్డురాకుండా, బాబా నన్ను ఎన్నో విధాల ఆదుకున్నారు.

## తొలిదర్శనం

1949 ఆగస్టు ఒకటిన మేం మౌనం అవతార్ మెహెర్‌బాబాకీ జై నినాదాలతో మౌనం విరవమించాం. ఆ తర్వాత ఓ రోజున - అహ్మద్‌నగర్ నుంచి బాబా దాస్ వచ్చారు. హమీర్‌పూర్‌లో నవంబరు ఒకటినుండి మెహెర్‌బాబా పర్యటించనున్నారు. ఇందుకోసం మనందరం కల్సి బాబా పర్యటన కార్యక్రమాల గురించి చర్చించుకోవాలి. నన్ను **రథ్‌కు** రమ్మనమని బాబా ప్రేమికులు శ్రీ శ్రీపతి సాహి నాకు లేఖ రాశారు. శ్రీపతి సాహి రథ్ అనే గ్రామంలో వుంటారు. నేను ఆయన్ని కలవాలని రథ్ బయల్దేరినా, తీవ్ర వర్షం, మరి ఇతర కారణాల వల్ల తిరిగి నేనుండే రేవాకు తిరిగి వచ్చేశాను. ఆ దరిమలా, ఇదే విషయమై అహ్మద్‌నగర్ నుంచి మెహెర్‌బాబా కార్యదర్శి శ్రీ ఆదీ.కె.ఇరానీ కూడా నాకు ఒక టెలిగ్రాం పంపారు. ఆ మేరకు మేం అందరం బాబా కార్యక్రమం గురించి చర్చించుకున్నాక- ఒకమారు అవతారుడిని భౌతికంగా దర్శించుకుని, ఆయన ఆదేశాల ప్రకారం హమీర్‌పూర్ జిల్లాలో బాబా పర్యటన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించాం. ముందుగా నాతో పాటు మరో నల్గురం మొత్తం ఐదు మందిమి 1949 ఆగస్టు 26న బయల్దేరి అహ్మద్‌నగర్‌కు వస్తున్నామని, బాబా దర్శనం కోసం అనుమతించమని టెలిగ్రాం పంపాం. ఐతే, ఇందుకు బాబా దాస్ ఒక్కనికే ముందుగా అనుమతి ఇచ్చినా, ఆ దరిమలా- ఆగస్టు 30న మమ్ములందర్నీ బాబాను కలుసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఆగస్టు 29న అహ్మద్‌నగర్‌కు చేరాం. ఆరోజు సాయంత్రం ఆదీ.కె.ఇరానీ మమ్ముల్ని మెహెరాబాద్‌కు తన కారులో తీసుకెళ్ళారు అయితే బాబాను కల్సిన ఆదీ, బాబా మమ్ముల్ని ఆ మర్నాడు కలుస్తారని కబురు తెచ్చారు. బాబాదాస్ మెహెరాబాద్‌లోని బాబా ఆశ్రమం చుట్టూతా

తిప్పి- మాకు అక్కడ విశేషాలు తెలియజేశాడు. బాబాదాస్ మమ్మల్ని అక్కడివారందరికీ పరిచయం చేశాడు.

### 1949 ఆగస్టు 30

మా జీవితంలో మరచిపోలేని రోజు , 1949 ఆగష్టు 30. సాక్షాత్తూ భగవంతుడ్ని- దర్శించుకున్న పుణ్య దినం ఇది. ఈ భూమిపై అవతరించిన అవతార మూర్తిని దర్శించుకున్న శుభ సమయమది. ఉదయం 7 గంటలకు బాబా తన గదిలోకి వచ్చారు. మమ్మల్ని 7.30 నిముషాలకు బాబా కూర్చున్న కేబిన్‌లోకి పిలిచారు. మాకు బాబా 5 నిముషాల సమయం కేటాయించారు. మా అదృష్టం కొద్దీ బాబా సమక్షంలో మేం 34 నిముషాలుపైగా ఉన్నాం. ఆ గదిలో బాబా నేలపై మెత్తని సీటుపై కూర్చున్నారు. ఆయనకు దగ్గరగా, ఆయన చుట్టూతా మేం ఐదుగురం కూర్చున్నాం. ఆ దైవీ సన్నిధిలో నన్ను నే మరచిపోయాను. బాబా తన అక్షర ఫలకంపై **People call me the Lord of the Universe, but I am the servant of the Universe. I am the washer-man come to cleanse the dirt of humanity ...**

**You all are very fortunate to be here at this moment when I am about to enter my New life** అన్నారు.

ప్రజలందరూ నన్ను ఈ విశ్వం అంతటికీ ప్రభువునని ప్రస్తుతిస్తారు. కానీ నేను ఈ విశాంవనికి సేవకుడను. మానవాళి యొక్క మలినాన్నంతటినీ శుద్ధి చేయడానికి నేను అవతరించానని బాబా తన అక్షర ఫలకంపై ఇలా రాశారు.

1949 అక్టోబరు 15 నుండీ ఒక ఏడాది పాటు కఠినంగా పాటించవల్సిన మూడు నియమాలు మీకు ఇస్తాను. మీరు బాగా ఆలోచించుకుని మీ నిర్ణయం తెలిజేయండి. మీరు నేను ఇచ్చే నియమాలు పాటించలేమని చెప్పినా ఫరవాలేదు. ఐతే ఆ మూడు నియమాలలో ఒకటి కానీ, రెండు లేదా మూడింటినీ తు.చ తప్పక అమలు చేస్తామని నాకు వాగ్దానం చేస్తే, వాటిని ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే మీరు తప్పక పాటించాలి. కాబట్టి తీరిగ్గా ఆలోచించి, నాకు వాగ్దానం చేసేముందు మంచి నిర్ణయం తీసుకోండి.ఆ మూడు ఆదేశాలు ఏమంటే 1). ధనం తాకరాదు. 2). స్త్రీలను ముట్టుకోరాదు.

3) వారంలో ఏదైనా ఒక రోజున మీరు ఉపవాసం వుండాలి.

ఐతే, నేను బాబా ఆదేశాలలో మొదటిది, మూడవ నియమాలను తు.చ.తప్పక, నూటికి నూరు శాతం పాటించగలనని, స్త్రీలను తాకరాదన్న నియమంలో విఫలమౌతానేమోనని బాబాకు జవాబిచ్చాను.మామాటల్ని బాబా సావధానంగా ఆలకించారు. ఆ పిదప- హమీర్‌పూర్‌లో బాబా పర్యటనపై మాట్లాడాం.





ఒక్క షరతుపై హమీర్‌పూర్‌లో బాబా తన దర్శన కార్యక్రమానికి అంగీకరిస్తానని చెప్పారు. అదేమంటే "If you make it your responsibility to see that no one coming to my Darshan folds his hands before me or touches my feet.".

నా దర్శనం కోసం వచ్చే ప్రజానీకం నా ఎదుట వారి రెండు చేతులు జోడించి నమస్కరించడం, నా పాదాలు తాకడం లాంటి పనులు చేయరని మీలో ఎవరైనా బాధ్యత తీసుకుంటామంటే నేను హమీర్‌పూర్‌కు వస్తానని దర్శన కార్యక్రమంలో పాల్గొంటానని బాబా హామీ ఇచ్చారు. ఇది అసాధ్యం కదా !! అయితే, ఆ మాదిరిగా ప్రజలు దర్శించుకునేందుకు ప్రయత్నిస్తామన్నాను. అందుకు బాబా అంగీకరించ లేదు. పూర్తి వాగ్దానం తప్పనిసరి అన్నారు. రిస్కుతో కూడినటువంటి ఆ వాగ్దానం మేం చేయడానికి సాహసించలేదు. అయితే, మీరు హమీర్‌పూర్ వెళ్ళి ఇందుకు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయండి. కరపత్రాలు తయారు చేయండి. నమూనా కాపీ నొకదాన్ని ఇప్పుడు నాకు చూపండి అని అన్నారు. బాబా మాతో తిరిగి ఇలా అన్నారు.

You are all very fortunate to have come to meet me when I am just about to enter New life" మేం బయటకు వచ్చేశాక కూడా ఆదీజీతో మా గురించి ప్రస్తావిస్తూ- 'వీరు చాలా అదృష్టవంతులని' అన్నారని ఆ తర్వాత ఆదీజీ మాతో అన్నారు.

ఆ తర్వాత బాబా గదినుండి బయటకు వచ్చి, బాబా పర్యటన కార్యక్రమంకు సంబందించి కరపత్రం నమూనా తయారు చేసి బాబా ఆమోదం కోసం పంపాం. బాబా ఆమోదించి తిరిగి మాకు ఇచ్చారు. ఆ సమయంలో నా ఆనందానికి హద్దులేవు.

ఆ రోజుల్లో బాబా సమక్షంలో బయట నుంచి వచ్చిన వారెవ్వరూ రోజుమొత్తంలో 12 గంటలకు మించి మెహెరాబాద్‌లో వుండరాదు. మేం మెహెరాబాద్‌కు చేరి 12 గంటలు దాటడంతో మమ్మల్ని కారులో తీసుకుని అహ్మద్‌నగర్ రెల్వేస్టేషన్‌లో దించారు. హమీర్‌పూర్‌కు తిరుగు ప్రయాణమయ్యాం. నేను తిరిగి సెప్టెంబరు 25న బాబా దర్శనం కావాలని టెలిగ్రాం పంపాను. **నాకూ- నా కుటుంబానికి బాబా ప్రేమ అందిస్తున్నట్లు- దర్శనం కుదరదని' తంతి పంపారు.**

నా హృదయం తేలికయింది. అవతారుని దివ్య దర్శనం నాలో ఎంతో మార్పు తీసుకొచ్చింది. నాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించినట్లుంది. నా హృదయం బాబా ప్రేమతో నిండినట్లుంది. అంతక్రితం వరకూ నేను కోరుకున్న హోదాలు- అధికార దర్పం అంతా మాయ- భ్రాంతి అన్న ఆలోచనలు నన్ను చుటుముట్టాయి .❀

ట్రావెలాగ్

## అవతారుని పాదస్పర్శ సోకిన

# 'హేలాపురి'

హేలాపురి అంటే మరేదో కాదు పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన ఏలూరు పట్టణాన్ని చరిత్రలో హేలాపురి అని, హేలావూరు, ఏర్లపూరని చుట్టూతా ఏర్లు ప్రవహిస్తున్న ప్రాంతంగా పిలిచేవారు. ఏర్లవూరే– 'ఏలూరు'గా రూపాంతరం చెందింది.

అవతార్ మెహెర్‌బాబా ఏలూరు పట్టణాన్ని రెండుసార్లు సందర్శించారు.

1). 1953 జనవరి 23 నుండి 28 వరకు

2). 1954 ఫిబ్రవరి 22 నుండి 24 వరకు,

ఈ రెండు సందర్భాలలో బాబా ఏలూరులోని కట్టా సబ్బారావు తోటలో బస చేశారు.

ఇక్కడ మెహెర్‌బాబా తన స్వహస్తాలతో స్థానిక బాబా సెంటర్ **మెహెర్ నిలయం** కోసం 1953 జనవరి 28న శంఖుస్థాపన చేశారు. కాగా, 1988 డిశంబరు 25న అంటే మూడు దశాబ్దాల తర్వాత స్థానిక బాబా ప్రేమికులు నిర్మాణపు పనులు పూర్తిచేసి ప్రారంభించారు.

ఇటీవల మా సొంత పనులమీద నేను, మా తమ్ముడు కిషోర్– ఇద్దరం – ఏలూరు– పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్ళవల్సివచ్చింది. ఏలూరుకి వెళ్ళాలనగానే నాకు ముందుగా కట్టాసుబ్బారావు తోటలో బాబావారు ఆంధ్రా పర్యటనలో విడిదిచేసిన ఇంటిని చూడాలని, కట్టావారి తోటలో బాబా సెంటర్‌ను తప్పక చూడాలనిపించింది. మాలో ఈ చిన్న కోరిక చాలా కాలంగా వుంది. దాంతో– మేం ఏలూరుకు వెళ్ళేందుకు రెండ్రోజుల ముందుగానే, స్థానిక బాబా సెంటర్ కార్యదర్శి శ్రీ బాపిరాజు గారితో, శ్రీ పెమ్మరాజు కృష్ణారావు గారికి చూచాయిగా ఏలూరు వస్తున్నాం మీరు వీలు చూసుకుని బాబా సెంటర్ చూపించాలని ఫోన్‌లోనే కోరుకున్నాం. అందుకు వారు సరే నన్నారు.

మేం సెప్టెంబరు 18న హైదరాబాద్ నుండి బయల్దేరి నేరుగా కొవ్వూరు మెహెరస్థాన్‌కు సెప్టెంబరు 19 ఆదివారం ఉదయం 7 గంటల కల్లా వెళ్ళాం. అక్కడ బాబా దర్శనం చేసుకుని ఏలూరుకు ఉదయం 11 గంటలకు చేరాం. ఏలూరులో మా స్వవిషయాలు ముగిసేసరికి సుమారుగా మ॥ 2 గంటలయ్యింది. ఆ తర్వాత మ॥ 2.30 ప్రాంతంలో







1953 జనవరి 28న శంఖుస్థాపన చేశారు

బాపిరాజు గారికి ఫోన్ చేసి, ఆయనతో కల్సి కట్టాసుబ్బారావు తోటలోని బాబా సెంటర్‌కు వెళ్ళాం. ఆ రోజు ఆదివారం. చాలా ప్రశాంతంగా ఉంది. బాబా సెంటర్ నిర్మాణపు వివరాలు గురించి శ్రీ బాపిరాజు చెబుతూ.. ఆ రోజు.. 1953 జవరి 28, మెహెర్‌బాబా తన తొలి ఆంధ్రా పర్యటనలో చివరి రోజు, మెహెర్‌బాబాకు ఆనాడు ఆతిథ్యం ఇచ్చిన కట్టా సుబ్బారావు గారి కోరిక మేరకు, బాబా సెంటర్ భవనం కోసం మెహెర్‌బాబా స్వయంగా ముత్యాలు – నవ ధాన్యాలతో శంఖుస్థాపన చేశారన్నారు. అయితే ఆ సెంటర్ నిర్మాణపు పనులు వెంటనే చేపట్టలేదు. కారణాలు ఏమైనా నేడు మనం చూస్తున్న బాబా సెంటర్ నిర్మాణపు పనులు పూర్తస్థాయిలో పూర్తవడానికి సుమారు మూడు దశాబ్దాల తర్వాత 1988 డిశంబరు 25న లాంఛనంగా ప్రారంభించారు.

నేడు విశాలమైన సెంటర్‌లో బాబా ప్రేమికులు శ్రీ బాల గోపాల భాస్కరరాజు గారు చిత్రించిన నిలువెత్తు అవతారుని చిన్ముద్ర చిత్రం, సప్తభూమికలుతో ఆధ్యాత్మిక చింతనాపరుల్ని మైమరపింపచేస్తుంది. సెంటర్ చుట్టూతా ప్రశాంత వాతావరణంతో– విశాలమైన పెద్ద హాలులో పాలరాయి పరచి, శుభ్రతతోపాటు అవతారుని దైవత్వం ఉట్టిపడేలా వుంది.

మెహెర్‌బాబా తొలి ఆంధ్రా పర్యటనలో ఏలూరు పట్టణానికి విచ్చేస్తుంటే, మెహెర్‌బాబాకు



బస ఎక్కడ ఏర్పాటు చేయ్యాలన్న మీమాంశలో నిర్వాహకులుంటే స్థానిక వ్యాపారస్థులు శ్రీ కట్టా సుబ్బారావు- తమ తోటలో బాబావారికి చక్కని విడిది ఏర్పాటు చేస్తానని స్వచ్ఛందంగా ముందుకొచ్చారని స్థానికుల కథనం. అందుకు గల కారణం కట్టావారు స్వయంగా ఏమని చెప్పేవారంటే **"నేను పుట్టిన తర్వాత మా తండ్రి నా జాతక చక్రం గీయించారు. ఈ జాతక చక్రంలో రాసిన ప్రతిచిన్న విషయం తు.చ తప్పక అన్నీ క్రమం తప్పక జరుగుతున్నాయి. ఆ జాతకంలో ఇంకా ఏముందంటే, ఈ ఏడాది అంటే 1953 ఆరంభంలో (అంటే మెహెర్‌బాబా వారి తొలి ఆంధ్రా పర్యటన రోజులవి) నాకు దివ్యానుగ్రహం చేత భగవంతుని దర్శనం లభిస్తుందని, నాకిక పునర్జన్మ ఉండదని, ఆ జాతక చక్రంలో రాసి వుంది"** అన్నారు.

ఎప్పుడయితే బాబా ప్రేమికులు అవతార పురుషుడు సాక్షాత్తూ భగవంతుడైన మెహెర్‌బాబా ఏలూరు పట్టణానికి 1953 జనవరి 23న వస్తున్నారని నా చెవిన వేశారో ఆ అవకాశాన్ని అంది పుచ్చుకుని మా కొబ్బరి తోటలో వున్న రెస్ట్‌హౌస్‌లో అవతారునికి ఆతిథ్యం ఇస్తానని ప్రకటించానని శ్రీ సుబ్బారావు పేర్కొన్నారు. ఆ మాదిరిగా కట్టా సుబ్బారావు తోటలో మెహెర్‌బాబా తన తొలి ఆంధ్రా పర్యటన సమయంలో అలాగే, రెండవసారి ఆంధ్రా పర్యటనలో ఇక్కడున్న రెస్ట్ హౌస్‌లో విడిది చేశారు ఇక్కడ్నుంచి దగ్గరలో వున్న సర్ సి.ఆర్.రెడ్డి కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున ప్రజాదర్శనం ఇచ్చారు. ఆనాడు కొన్ని వేలమంది బాబావారి దర్శనం చేసుకున్నారు. మెహెర్‌బాబా తన స్వహస్తాలతో విచ్చేసిన జన సందోహానికంతటికీ ప్రసాద వితరణ చేశారు. అంతేకాదు, స్థానికంగా సుమారు 90 మంది ఇళ్ళకు బాబా స్వయంగా వెళ్ళి వారి గృహాలను పానవం చేశారు. జిల్లా జడ్జిగారిల్లు, జిల్లా కలెక్టరులే కాదు పేద బడుగు బలహీన కార్మికులతోనూ, చిన్న పిల్లలు- ముదుసలి వారితోనూ అందరితో కల్సి బాబా తమ ఆశీర్వచనాలు





అందించారు. అందులో అనేక అమూల్య సందేశాలు ఇచ్చారు. కొందరికి ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. హాస్య చతురోక్తులతో సరస సంభాషణలూ చేశారు.

ఆనాడు కట్టావారి తోటలో మెహెర్‌బాబాతో వచ్చిన సుమారు 40 మందికి అనువైన ప్రత్యేక గుడారాలలో బస ఏర్పాటు శ్రీ కట్టా చేశారు. చక్కని విందు ఇచ్చారు. ఆనాడు ఈ తోటను నందనవనంలా కళకళలాడేలా అలంకరించారు. బాబా బసచేసిన గదికి ముందర భాగంగా విచ్చేసే జన బాహుళ్యానికి వీలుగా చలువ పందిళ్ళు వేయించారు. సుమారు 40 మంది మండలి సభ్యులు- ఇతరులు బాబాతో వచ్చారు. వారందరికి మంచాలు- ఆ మంచం ప్రక్కనే అతిథి అభ్యాగతులు కూర్చోడానికై కుర్చీలు ఏర్పాటు చేశారు. పాకశాల, భోజనశాలలు, స్నానాల గదులు ఇతరత్రా తాటాకులతో విశాలంగా వేయించారు. రాత్రిపూట విద్యుద్దీపాలతో పట్టపగలును తలపింపజేశారు. తెల్లవారు ఝామున 4 గంటలకే స్నానాలకు వేడి నీళ్ళు, భోజనం తయ్యార్ ! అని చెప్పడానికి ప్రత్యేకంగా ఓ గంట, అహా !! ఏమి ఆ ఏర్పాట్లు అని ఆశ్చర్యపడేలా శ్రీ కట్టా చేశారు.

ఆప్యాయతతో- కొసరి - కొసరి శ్రీ కట్టా విచ్చేసిన బాబా బృందం అందరికీ చక్రకేళీలు, మెత్తని పూరీలు, వేడి వేడి హల్వా స్వీట్లు, తాజా పళ్ళరసాలు, మండలివారికి పేరు పేరునా సాదరంగా- ఆప్యాయత కలగల్పిన ప్రేమతో - ఎవరికి ఏ సమయంలో ఏం కావాలో స్వయంగా - శ్రీ కట్టాసుబ్బారావు చూసుకున్నారని, ఆయన సమకాలీనులు రాతల వల్ల తెలుస్తోంది.



శ్రీ రాముడికి– భరద్వాజుడు ఇచ్చిన విందుని– శ్రీ కట్టా సుబ్బారావు జ్ఞప్తికి తెచ్చారని ఆయన సమకాలీనులు అభిప్రాయపడతారు.

రెండవ దఫా ఆంధ్రా పర్యటనలో ముందుగా బాబా తన మండలి వారిని తమ ఆరోగ్యాలు జాగ్రత్త సుమా అని హెచ్చరించారట. ఎందుకో తెలుసా? శ్రీ కట్టా బాగా **తిను– తిను** అని బలవంతం చేస్తాడు. మీ కడుపులు– ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండని – బాబా ముందుగా అలా అన్నారని చతురోక్తిగా చెప్తారు.

ఐతే నేటికి సుమారు దశాబ్దకాలం క్రితమే– శ్రీ కట్టావారి తోట కాంక్రీటు జంగిల్‌గా మారిందని స్థానికులు చెప్పారు. పచ్చదనం అక్కడక్కడా కన్పించినా బహుళంతస్థుల అపార్టుమెంట్లు, డూప్లెక్స్ విల్లాలతో రియల్ ఎస్టేట్ బూమ్‌తో నేడు శ్రీ కట్టా సుబ్బారావు గారి తోటలో పేరుకే 'తోటగా'– కనబడుతోంది.

ఏమైనా– అవతారుడి పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంతంలో, మెహెర్‌బాబా వేసిన పునాదిరాయి ప్రాంగణంలో చక్కని ప్రార్ధనా మందిరం నిర్మించారు. ఇక్కడ ప్రతి ఆదివారం సాయంత్రం 6 నుండి 8 దాకా సహవాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇక్కడ నుంచి, సుమారు ఓ ఫర్లాంగు దూరంలో బాబావారు బస చేసిన ఆనాటి రెస్ట్‌హౌస్ ఉంది. ఆ రెస్టు హౌసును ఉన్నది ఉన్నట్లుగా వుంచుతూ– ఆవాస యోగ్యంగా పునఃనిర్మాణం చేశారు. ఆ గదిలో ఆనాడు బాబా విశ్రాంతి తీసుకున్న మంచం, అవతారుని చిత్ర పటాలు యధాతధంగా వున్నాయి. ఇందుకు అదనంగా, మరో రెండు మూడు గదులతో పాటు, విచ్చేసే అతిథులకోసం ప్రత్యేకంగా ఓ గది నిర్మాణం యిక్కడ స్థానిక బాబా ప్రేమికులు ఏర్పాటు చేశారు. ఆనాడు బాబా ఉపయోగించిన కర్ర కుర్చీ, తన ప్రేమికులతో తీయించుకున్న ఫోటోలు– అరుదైనవి. అపూర్వమైన రీతిలో – బాబా ప్రేమికులకు అందుబాటులో వుంచారు.

బాబా విడిది చేసిన ఈ ప్రాంగణంలో ప్రతి గురువారం సాయంత్రం 6 గంటల నుండి 8 దాకా బాబావారి సహవాస్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఇదంతా ఇలాగ వుంటే మరో ముఖ్యమైన చారిత్రక ప్రదేశం ఏలూరు పట్టణంలో వుంది. అది చూడకుండా వెళ్ళిపోదామనుకున్నాం. బాబావారి కృపవల్ల – శ్రీ బాపిరాజు మమ్ముల్ని అక్కడకీ తీసుకెళ్ళారు.

ఏలూరు పట్టణంలో పోణంగిరోడ్, దక్షిణపు వీధి, జలాపహరేశ్వర స్వామి ఆలయం దగ్గర్లో– స్వర్గీయ్య శ్రీ కలవలపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి గారింట్లో **1952 జనవరి ఒకటిన–** ముక్కోటి ఏకాదశి, సోమవారం, ఉదయం 7 గంటల వేళ బాబావారి తొలి సెంటర్ స్థానికంగా ప్రారంభించారు. అప్పటికి ఈ ప్రాంతీయులు ఎవరూ మెహెర్‌బాబాను





దర్శించలేదు. అప్పటి బాబా ప్రేమికులు శ్రీ యర్రంశెట్టి రంగారావు– మాత్రం బాబావారి రేఖా చిత్రాన్ని చిత్రించి, ఈ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. అప్పటికింకా శ్రీ యర్రంశెట్టి రంగారావు కూడా మెహెర్‌బాబాను దర్శించలేదు. ఆయన జీన్ ఆడ్రియల్ రాసిన గ్రంధం 'అవతార్' చదివి బాబావారి దివ్యత్వం పట్ల ఆకర్షితులయ్యారు. ఆ దరిమలా 1952 జూన్‌లో తొలిసారిగా బాబా మండలి సభ్యులు– బాబావారి ఆంధ్రా పర్యటన కంటే ముందుగా, ముందుస్తు ఏర్పాట్ల పరిశీలనకై సో. ఏరుచ్– సో. పెండూలు ఏలూరు వచ్చారు.

1953 జనవరిలో మెహెర్‌బాబా ఏలూరు పట్టణ పర్యటనలో భాగంగా, ఈ సెంటర్‌ను సందర్శించి, శ్రీ రంగారావు గీచిన చిత్రానికి ఎదురుగా నిల్చి బాబా ఆరతి యిప్పించారు. నేడు శ్రీ కలవలపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి గారి మునిమనుమడు– మూడవతరంలో అదే బాబా చిత్ర పటానికి నిత్యం ఆరతి అందిస్తున్నారు. తన చిన్ననాటి నుండీ నేటి దాకా– వారింట బాబా ప్రేమలో జరిగిన అనేక అనుభూతులు వారు మాతో చెప్పారు. ఏలూరులో వున్న బాబావారి ప్రధాన ప్రదేశాలు మూడింటిని చూడటం పూర్తయ్యేసరికి సాయంత్రం 7 గంటలు దాటింది. దాంతో అదే రోజు రాత్రికి ఏలూరు నుండి రైల్లో విజయవాడ చేరి, ఆ మర్నాటికల్లా హైదరాబాద్ తిరిగి వచ్చేసాం !!

తెలుగునాట గల ప్రతి బాబా సెంటర్‌కు ఓ ప్రత్యేకత వుంది.

ఐతే, అవతారుడు బసచేసి, తన పాదస్పర్శతో పునీతం చేసిన ఏలూరు పట్టణంలో వున్న వాటిని చూడాలనుకున్న మా చిరకాల కోరిక ఇలా తీరింది.

వీలు చిక్కితే మీరూ ఏలూరు బాబా సెంటర్‌ను ఓ మారు సందర్శించాలనుకోవడం సంతోషం.

**– మల్లాది కృష్ణానంద్.**

# మార్గదర్శిని

పాత గాజువాక బాబా సెంటర్ నిర్వాహకులు శ్రీ వల్లూరి నాగేశ్వరరావు తెలుగునాటగల పలు బాబా సెంటర్ల సమాచారం సేకరించి అవతార్ మెహెర్‌బాబా మార్గదర్శిని పేరిట ఒక సంకలనం ప్రచురించాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో గల పలు బాబా సెంటర్ల కార్యనిర్వాహకులు చొరవ తీసుకుని తమ బాబా కేంద్రాలకు సంబందించిన సంపూర్ణ సమాచారాన్ని త్వరలో పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు. మరింత సమాచారం కోసం శ్రీ వల్లూరి నాగేశ్వరరావు ఫోన్–9948281785 సంప్రదించవల్సింది.

# ఆధ్యాత్మిక జ్ఞానం

- సామల రాజమల్లయ్య

సీ॥వనితపై ధనముపై పదవిపై వ్యామోహ
మధికమై కలహంబులధికమయ్యె
మత సామరస్యము మంటగలిసి నేడు
యుద్ధాలచే భూమిదద్దరిల్లె
ప్రేమానురాగాలు పేరుకైనను లేక
ఇంటింట కలహమంబులెక్కువయ్యె
సర్దుబాటుతనమ్ము సహన భావము లేక
కరువయ్యె శాంతి సౌఖ్యాలు నేడు
శాంతికిని మూలమైనట్టి సమరసాలు
సంస్కృతికి సమమ్మె కొన సాగుచున్న
కలహమును మాటలే మరి కలుగకుండు
భూతల స్వర్గమగును కాపురము నేడు
మానవా! విను మేహెరు మౌనవాణి
తేనెలొలికెడు తీయని దివ్య వాణి

# ముటుకూరు కేంద్ర నూతన భవన ప్రారంభం

అవతార్ మెహెర్‌బాబా ముటుకూరు కేంద్రం నూతన భవనాన్ని బాబా ప్రేమికులు శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి గారు అక్టోబరు 14న ఉ. 11 గంటలకు ప్రారంభించనున్నారు.

గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతంలో మాచర్ల దాటాక దుర్గి మండల కేంద్రానికి సుమారు 10 కిమీ దూరంలో గల చిన్ని గ్రామం - ముటుకూరు.

స్కూలు ప్రధానోపాధ్యాయునిగా రిటైరయి, ముటుకూరులో స్థిరపడ్డ బాబా ప్రేమికులు శ్రీ యాగంటి వెంకట సుబ్బయ్య తమ గ్రామంలో మెహెర్‌బాబా ప్రార్థనామందిరం నిర్మించాలని ఎంతో కాలంగా కృషి చేస్తున్నారు. సుమారు 5 సెంట్లు పైబడిన స్థలంలో





రమారమిన 10 లక్షలు రూపాయలు ఖర్చుతో బాబా ప్రార్థనా మందిర నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు.

ఈ సందర్భంగా ఆక్టోబరు 14 ఉదయం 7 గంటల నుండి 2 గంటల దాకా ప్రత్యేక బాబా సహవాస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సెంటర్ నిర్మాణంలో అకుంఠిత దీక్షతో కృషి చేసిన ముటుకూరు సెంటర్ అధ్యక్షులైన శ్రీ కొల్లిశెట్టి వెంకట నర్సింహరావు, కార్యదర్శి శ్రీ లింగా వెంకన్న, కోశాధికారి, శ్రీ యాగంటి సుబ్బయ్యలు అభినందనీయులు. ❊

# వరుడు కావలెను

**శ్రీ గౌరు గోపాల్‌రెడ్డి,** Systems Analyst, Fidelity Investments, 536 stonecroft Ln, Cary, NC 27519,వారి ఇ-మెయిల్- meher_gopal@yahoo.co.in, Ph: 919-650-2529 వారి కుమార్తె కుమారి గౌరు కీర్తి వివాహ సందర్భంగా బాబా ప్రేమికుల పరిధిలో గాని లేదా ఇతరులు ఎవరైనా తగిన వరుడుకై తగిన వివరాలు పంపారు. దయచేసి పరిశీలించి స్పందించగలరు.

**Name:** Keerthi, **Date of Birth:** 12th Sep 1987, 6:10AM, **Height:** 5’4”,
**Complexion:** Wheatish. **Gothram:** Dasanolla,
**Native Place**: Ramireddy Palle, Jammalamadugu Mandal,
**Profession:** Associate Software Engineer, **Company:** Fidelity Investments, Joined in July 2009 as fulltime employee. Working from Fidelity’s IT Division located in Durham, NC,USA. **Salary:** 58k/ annum,
**Immigration status:** I-485 filed as dependent. ❊

# పత్రిక సభ్యత్వం

మెహెర్‌బాబా పత్రికకు 2008, 2009 నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని వారి సంఖ్య అధికంగానే వుంది. అలాగే జీవిత సభ్యత్వంలో మొదటి విడతగా 2006-08 ప్రాంతంలో రూ. 500 చెల్లించి రెండవ విడత చెల్లించని వారి సంఖ్యా అధికంగానే వుంది. 2010 వార్షికంలో నేటి వరకూ కేవలం 220 మంది మాత్రం తమ సభ్యత్వం చెల్లించారు. దయచేసి బాబా ప్రేమికులు ఈ విషయమై ఆలోచించవల్సిందిగా కోరుతున్నాం.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

ఈ సంఘటన తర్వాత అందరికీ రూఢిగా తెలిసిపోయింది. బాబావారు ఇహపై మెహెరాబాద్‌లో వుండరని స్పష్టమైంది. బహుశా అందుకనే కామోసు, బాబావారు మండలివారికో మాట చెప్పారు. నాతో వుండాలనుకొంటే వుండండి. లేకపోతే వెళ్ళిపొండి అంతా మీ ఇష్టం. మీ ఇష్టమే నాకు ఇష్టం. నాతో వుండాలంటే మాత్రం నా నియమాలకి కట్టుబడి వుండాలి సుమా అని స్పష్టం చేశారు.

ఈ సంగతినే నోటీసు బోర్డుపై వ్రాయించారు. మీ నిర్ణయం త్వరగా చెప్పండి అని అన్నారు. నోటీసులో రెండు భాగాలున్నాయి. ఒక భాగం బాబాతో వుండదలిచిన వారికయితే, రెండవ భాగం తమ దారిన వెళ్ళిపోదలిచినవారికి. ఆ వివరాలు...

**బాబాతో వుండదలచినవారు ఏం చేయాలి.**

బాబా ఆజ్ఞకి ఎదురు చెప్పకూడదు. ఎందుకు ? ఏమిటి ? అని ప్రశ్నించకూడదు. బాబా మాటని శిరసావహించాలి. బాబా ఆదేశాల ప్రకారంగా నడవడానికి ప్రయత్నించాలి. బాబా నుంచి ఏమీ ఆశించకూడదు. ఆధ్యాత్మికంగా లబ్ధి కానీ, సుఖసంతోషాలపరంగా కానీ ఏదో వొరుగుతుందన్న హామీ బాబా ఇవ్వరు. బాబా ఫలానా చోట వుంటారని లేదు. ఎక్కడికయినా బాబా వెళ్ళవచ్చు. ఆ వెళ్ళిన చోట ఎంతకాలమైన వుండవచ్చు. అదీ ఇదీ కాదు అనిపిస్తే ఇంకో వూరికి కదలవచ్చు. అంతా బాబా ఇష్టం. బాబా దగ్గర వుండాలనుకొనే వారు ఫలానా చోట అయితే వుంటామనకూడదు. ఫలానా సమయమయితే బాగుంటుందనకూడదు. అసలు ఇటువంటి ప్రస్తావన తేకూడదు. బాబా నుంచి ఏమీ ఆశించకూడదు. ఒక్కమాటలో చెప్పాలంటే బాబాదగ్గర వుండాలనుకొంటే, భేషరుతుగా వుండాలి తప్ప, మాకిది కావాలి అది కావాలి అన్న షరతులు పెట్టకూడదు.

**తమ దారిన వెళ్ళ తలచిన వారు -**

పైన చెప్పిన షరతులు మీకు కష్టమనిపేస్తే మీ దారిన మీరు వెళ్ళవచ్చు. ఇంకేదైనా కారణం వల్ల మీ దారిన వెళ్ళిపోవాలనిపించినా మీరు భేషరుతుగా వెళ్ళవచ్చు. మీకా



స్వేచ్ఛని ప్రసాదిస్తున్నాను. మీరు చేయాల్సిందల్లా 'బాబా! నేను వెళ్ళిపోతున్నాను', అని చెప్పితే చాలు

బాగా ఆలోచించి మీ నిర్ణయం తీసుకోండి. బాబాకామాట చెప్పండి. వుండాలనుకొన్నా సరే, మీ దారిన వెళ్ళి పోవాలనుకొన్నా సరే మీ నిర్ణయాన్ని బాబావారికి చెప్పండి. సాధ్యమైనంత త్వరగా చేయండా పని. ఎందుకంటే యావత్తు మెహెరాబాద్ వ్యవస్థని మరో చోటకి మార్చాలనుకొంటున్నాను. కొత్త జాగాని నిర్ధారించలేదు. ఆ పని త్వరలోనే చేస్తాను, అని బాబావారు నోటీసు బోర్డుపై వ్రాయించారు.

సరే మెహెరాశ్రమాన్ని ఎక్కడకి మార్చవచ్చు. . ఏవూరు అయితే బాగుంటుంది? ఎవరికి తోచిన సలహా వారిచ్చారు. నవసారి బాగుంటుందన్నారు. ఒకరు అబ్బే, అంతకంటే మెరుగయిన వూరు **డామన్** అన్నారు. ఇంకొకరు, ఈ రెండు వూళ్ళూ గుజరాత్‌లో వున్నాయి. అంత దూరం దేనికి? ఇక్కడికి దగ్గరలోనే పూనా ప్రక్కన వో వూరువుంది. ఆ వూరిపేరు సింహ ఘడ్. అది మెహెరాశ్రమానికి చాలా అనువైన వూరని ఇంకొందరు చెప్పారు. ఈ మూడు వూళ్ళు చూసి వో నిర్ణయం తీసుకొంటామన్నారు బాబా. మే 15వ తేదీ ఉదయం నాలుగున్నరకి రుస్తుం కారులో అందరూ బయలుదేరారు. ముందుగా సింహ ఘడ్‌కి వెళ్ళారు. అక్కడ బి.డి.పుదుమే గారు బాబాకి అతిథి సత్కారాలు చేశారు. 'ఇక్కడ నాకో బంగళా వుంది. అందులోనే మీరు వుండవచ్చు, అని ఆయన బాబాకి చెప్పారు. కానీ ఆ వూరు బాబాకి నచ్చ లేదు. ఒకటి, అది బాగా ఎత్తైయిన కొండ ప్రాంతం. రెండు, అక్కడ వర్షాలు బాగా పడతాయట. గుజరాత్ వూళ్ళు చూద్దామనుకొన్నారు. బొంబాయి నుంచి గుజరాత్ మైల్‌లో నవసారీ వెళ్ళటానికి ఏర్పాట్లు జరిగాయి. కానీ బాబావారూ, మండలివారు బొంబాయి చేరేసరికి రైలు వెళ్ళిపోయింది. అనుకొన్న టయిమ్ కంటే మూడు గంటలు ఆలస్యంగా వీరు బొంబాయి చేరారు. సరే మేము వెనక్కి వెళ్ళిపోతాము. నువ్వు నవసారి వెళ్ళి, అక్కడ ఏలా వుంటుందో చూసి చెప్పు అని ఛాన్జీకి బాబా పని పురమాయించారు. అలా అతన్ని నవసారికి పంపి,

మర్నాడు మెహెరాబాద్‌కి బాబా తిరుగు ప్రయాణం కట్టారు.

దారిలో వో గమ్మత్తు జరిగింది. అది గమ్మత్తు అనేకంటే బాబా మహత్యం కళ్ళ ముందు ప్రత్యక్షమైంది అంటే బాగుంటుది.

రుస్తుం కారు నడుపుతున్నాడు. పదిమంది కిక్కిరిసి కూర్చొన్నారు. బోల్డంత లగేజి కారు టాపుపైన వేసి కట్టారు. ఇంత బరువుతో నిండు చూలాలుగా వుందాకారు. ఖండాలా దగ్గర ఘాట్ సెక్షన్ ఎదురైంది. కొండపైకి ఎక్కనని మొరాయించింది. వెనక్కి జారిపోవటం మొదలుపెట్టింది. ఎత్తయిన కొండ క్రిందికి కారు దొర్లుతుంటే భయం వేయదు, ఎవరికైనా. మండలి వారు భయంతో హాహాకారాలు చేశారు. కంగారుగా రుస్తుం బ్రేకు వేశాడు. బ్రేకు పడలేదు. ఇంకాస్త భయం పెరిగింది. కొండ అంచు దొర్లి, లోయల్లో పడతామా అనిపించింది. బాబా తమ్ముడు జాల్ రోడు పైకి దూకాడు. ఇంకొకరూ దూకారు. కారుని అటు త్రిప్పకు ఇటుత్రిప్పు అంటూ అరుస్తున్నారు. రుస్తంకి ఇవేమీ పట్టలేదు. 'బాబా' 'బాబా' అంటూ గట్టిగా గావు కేక పెట్టాడు. ముందు సీట్లోవున్న బాబా స్టీరింగ్ కేసి వొరిగారు. గట్టిగా స్టీరింగ్ చక్రం పట్టుకొన్నారు. అంతే కారు ఆగింది. బాబా కారు నెలా ఆపారా అని మండలివారు ఆశ్చర్యపడ్డారు. ఆనందంతో రుస్తుం బాబాని కౌగలించుకొన్నాడు. నీ దయవల్ల మాకు చావు తప్పింది, బాబా అన్నారు ఆందరూ. బాబా తప్ప అందరూ కారు దిగి ఘాట్ రోడ్డు దాటేవరకూ కారుని త్రోశారు. ఘాట్‌రోడ్డు దిగాక స్టార్ట్ చేస్తే కారు కదిలింది. హమ్మయ్య అంటూ అందరూ కారు ఎక్కారు.

తాలేగావ్ షెలార్వాడి మధ్య ఇంకో ప్రమాదం జరిగింది. అప్పటికి చీకటిపడిందేమో రోడ్డుకి అడ్డంగా వున్న చెట్టుని కారు ఢీ కొట్టింది. కారు లైట్ల వెలుతురు అంతంతమాత్రంగా వుండటంతో, రుస్తుం మహాశయుడికి ఎదురుగా రోడ్డుకి అడ్డంగా పడి వున్న చెట్టు కనబడలేదు. కావాలని ఎవరూ గుద్దరు కదా! మరి స్పీడుగా కారు వచ్చి చెట్టుని అలా ముద్దుపెట్టుకోవటంతో, అందరూ క్రిందా మీదా పడ్డారు. కాస్తంత వొళ్ళు గీసుకు పోయింది అంతే. ముందు సీటులో వున్న బాబావారికి ఏమీ కాలేదు. మరి కారుకో ? కారుకి ఏమీ అయినట్లు లేదు. ఎందుకంటే రుస్తం కారు దిగి చూశాడు. కారు అద్దం (విండ్ షీల్డ్) కాస్తంత బీట తీసింది. ఇంకెమీ కాలేదు అని అన్నాడు. అయితే ఆలస్యం దేనికి ? పోదాం పదండి పూనాకి అన్నారు అందరూ. అక్కడికి అంటే, ప్రహరా స్థలానికి పూనా దగ్గరే వో ఇరవై మైళ్ళ దూరం వుంటుందేమో అక్కడినుంచి. వో అరగంటలో పూనా చేరారు. అక్కడ మెకానిక్‌కి కారు చూపించారు.బంపరు వొంకర పోయింది. రేడియేటర్ నుంచి నీళ్ళు కారుతున్నాయి. ఇవేమీ పెద్ద సమస్య కాదు. జాగ్రత్తగా నడుపుతూ మీ వూరు వెళ్ళిపోవచ్చు అని మెకానిక్ చెప్పాడు.



మెహెర్‌బాబా అక్టోబరు 2010

బాబావారికి ఆ మాట చెపితే, సరే వెంటనే పోదాం కదలండి అన్నారు. వెంటనే అందరూ వేడి వేడి టీ త్రాగారు. కారు ఎక్కారు. మెహెరాబాద్ దారి పట్టారు. తెలతెలవారుతూండగా అక్కడికి చేరారు.

ఉదయాన్నే రుస్తుం కారుని నగర్‌కి తీసుకువెళ్ళాడు. రిపేర్లు చేయించాడు.

కొంచెం ప్రొద్దు ఎక్కాక అందరూ బాబా సన్నిధికి వచ్చారు. మళ్ళీ చర్చ. కొత్త వూరు పైకి మళ్ళింది. మాటలు మధ్యలో టోకా బాగుంటుందన్నారొకరు. ఇక్కడికి దగ్గరే. పెద్ద దూరం లేదు. ఔరంగాబాద్‌కు పోయే దారిలో వుందావూరన్నారు.

అయితే పోయి చూసివద్దామన్నారు బాబా.

బాబా ఆ మాట అనడమే తరువాయి టోకా యాత్రకి సన్నాహాలు జరిగినాయి. సాయంత్రం అక్కడికి చేరారు. ఆ వూరు విశేషాలు చూశారు. రాత్రికి తిరిగి వచ్చారు. టోకా కూడా పవిత్ర క్షేత్రం. గోదావరి, ప్రవర నదుల సంగమ స్థానం.

నగర్‌కి 45 మైళ్ళ దూరం అంతే. స్వామి రామదాసు, సాయిబాబా ఈ ప్రాంతాన్ని సందర్శించారుట. కొంతకాలం ఇక్కడ వున్నట్లు స్థల పురాణం చెప్తోంది. ఇక్కడి వాతావరణం బాబావారికి నచ్చింది. చుట్టూరా చక్కని కొండలు, పచ్చని చెట్లు, వాటి ప్రక్కగా ప్రవహిస్తున్న రెండు నదులు చూడటానికి టోకా ఎంతో ఆహ్లాదకరంగా వుంది. మనస్సుకి వూరటనిస్తోంది. జనసమ్మర్ధం అంతగా లేదు. అందుకనే నేమో, బాబావారు, మనం వెంటనే టోకాకి మారుదామన్నారు. ఆ మర్నాడు, అంటే, మే 18వ తేదీన అక్కడ స్థలం కొనిపించారు.

మనం అక్కడికి మారాలి. వెంటనే ఏర్పాట్లు చేయండని అన్నారు. ఇక్కడ మెహెరాబాద్‌లో ఎప్పటి అవసరాలకి తగ్గట్టు కట్టిన గదులని పడగొట్టండి. ఆ తలుపులు, దూలాలు, ఇటుకలతో టోకాలో కొత్త ఇళ్ళు కట్టండి. ఈ పని వెంటనే జరిగిపోవాలని ఆదేశించారు. మొదట పడగొట్టిన గదులు పురుష మండలివారివి. పాపం ! టోకా వెళ్ళే వరకూ, వాళ్ళు రాత్రిళ్ళు ఆరు బయటే పడుకోవాల్సి వచ్చింది.

పనివాళ్ళు రాత్రి, పగలనక కష్టపడి పని చేసి, రెండు వారాల్లో టోకా ఆశ్రమాన్ని రెడీ చేశారు. బాబావారి టేబుల్ క్యాబిన్‌ను మే 30వ తేదీ నాటికి టోకా తెచ్చారు.

అంటే పన్నెండూ రోజుల్లోనే బాబావారు చెప్పిన సుదీర్ఘయాత్ర జరిగింది.

వో ప్రక్క మెహెరాబాద్‌లో తాత్కాలిక ప్రాతిపదికన కట్టినవన్నింటినీ పడగొట్టి టోకాకి తరలిస్తున్నారు. ఇంకో ప్రక్క బాబా దర్శనార్థం వచ్చే వారి సంఖ్య రోజు రోజుకీ

పెరుగుతోంది. చట్టు ప్రక్కల వూళ్లనుంచీ పట్టణాల నుంచీ ఎందరో వస్తున్నారు. మాకు బాబా దర్శనం కావాలని పట్టు పడుతున్నారు. . ప్రభువు టోకా వెళ్ళి పోతున్నారన్న వార్త పొక్కిందేమో, దర్శనార్థుల సంఖ్య బాగా ఎక్కువైంది.

మే 27వ తేదీన వో ఇద్దరు వూడిపడ్డారు. ఎక్కడినుంచి వచ్చారో కానీ, మేము మెహెరాశ్రమ్‌లో చేరుతామన్నారు. మండలివారు బిజిబిజీగా వున్నారప్పుడు. బాబా పెట్టిన టోకా ముహూర్తం దగ్గర పడుతోందేమో, వాళ్ళకి వూపిరి సలపటంలేదు. వీళ్ళిద్దరికీ ఇప్పుడే సమయం చిక్కిందా మెహెరాశ్రమంలో చేరటానికి? ఇంతకి ఎవరా ఇద్దరు?

ఒకరు కైఖుస్రూ ప్లీడరు. ఇంకొకరు సావక్ దిన్‌షా కోత్వాల్. వీళ్ళద్దరితోపాటు మినూ.ఎన్.పోహూవాలా వచ్చాడు. బాబావారికి తను విన్నపం అందజేశారు. ఆయనేమో కాదనలేదు. మండలివారితో కలిసివుండండి. ఇక్కడ ఏం జరుగుతోందో, ఎవరు ఎలా పని చేస్తుంటారో గమనించండి అని బాబా చెప్పారు.

మర్నాడు అంటే మే 28వ తేదీన ప్లీడర్‌కి కొండ పైకి పిలుపు వచ్చింది. మనస్సు ఆనందంతో గెంతులు వేసింది. కొండ ఎక్కి బాబా వారి ముందు వినమ్రంగా నిలబడ్డాడు. ఏమిటి నీ కోరిక అని బాబా ప్రశ్నించారు. తపీమని జవాబు చెప్పాడు. దేముడిని చూడాలనివుంది అన్నాడు.

మౌన మూర్తి చిరునవ్వు నవ్వారు. నీది చిన్న కోర్కె కాదు. చాలా కష్టమైన కోర్కె కోరావన్నారు. ప్రపంచంలో ఇంతకంటే కఠోరమైన సంగతి మరొకటి వుండదన్నారు. దైవదర్శనం కావాలంటే, ఎక్కడలేని మనోస్థైర్యం కావాలి. ఎన్ని కష్టాలకయినా సిద్ధపడాలి. నవనాడులు కృంగి పోయినా కృంగి పోవచ్చని హెచ్చరించారు.

ప్లీడరు వెనక్కి తగ్గలేదు బాబా, మీరెన్ని చెప్పండి, నా మనస్సు మారదు. అన్నపానాదులు లేకపోయినా ఫరవా లేదు. కష్టాలు ఎన్నయినా సంతోషంగా భరిస్తాను. నాకేమీ కుటుంబ ఝంఝాటం లేదు. నేను స్వేచ్ఛా జీవిని. భగవదన్వేషణే నా లక్ష్యం. భగవత్ దర్శనమే నా గమ్యం అన్నాడు.

అయితే వో పని చేయి అన్నారు బాబా. ఇంటికి వెళ్ళి అక్కడ చేయాల్సిన పనులు పూర్తిచేయి. బాధ్యతల నుంచి పూర్తి స్వేచ్ఛ లభించిందీ అనిపించాక నా దగ్గరకి రా అని బాబా హితవు చెప్పారు.

బాబా చెప్పిన ప్రకారం చేస్తానని ప్లీడరు అన్నాడు. వెంటనే బొంబాయి వెళ్ళాడు. చుట్టాలకి రమ్మని కబురు పంపాడు. వాళ్లు రాగానే, తన నిర్ణయం చెప్పాడు. బరువు బాధ్యతలు వదిలించు కొంటున్నాను. మెహెర్‌బాబా ఆశ్రమంలో చేరబోతున్నానని అన్నాడు.





చిన్నాచితకా ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. అవి చేశాడు. హమ్మయ్య? నా బరువు తీరింది అనుకొన్నాడు. వారం తిరగకుండానే మెహెరాబాద్ వాపసు వచ్చాడు.

అంటే టోకాలో ఏర్పాట్లు పూర్తయినాయి. ఇహ ఈవాళో రేపో అక్కడికి తరలి వెళ్ళాలి అనుకొంటున్న సమయానికి ప్లీడరు బాబా దగ్గరకి వచ్చేశాడు.

బాబా వారు మే 31 వ తేదీన వో సారి టోకా వెళ్లి వచ్చారు. కొత్త ఆశ్రమం ఎలా కట్టిందీ చూశారు. మండలివారు తమ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశారా లేదా? వసతుల కల్పించారా లేదా అని జాగ్రత్తగా గమనించారు. ఫరవాలేదు. బాగానే వున్నాయి అన్ని అని సంతృప్తి చెందారు.

జూన్ రెండవ తేదీన మినూ పోహూవలాని పిలిచారు. సుతిమెత్తగా చివాట్లు పెట్టారు. ఎందుకూ అంటే ఇతగాడికి వో ఆలవాటుంది. దైవభక్తి, దైవభీతి ఎక్కువేమో, కనిపించిన ప్రతి సన్యాసి దగ్గరకీ వెడతాడు. ఫలానా చోట వో గురువు గారున్నారు. మంచి మహత్యాలు చేస్తాడట అని చెప్పితే, అక్కడికి పరుగెడతాడు. వొక్క మినూ మహశయుడేమి ఖర్మ ఇలా చాలా మందిచేస్తారు. ఎక్కడ ఏ స్వాములువుంటే, అక్కడికి వెళ్లటం, తీర్థ ప్రసాదాలు పుచ్చుకొని తరించామనుకోవటం వో రివాజు. ఇది పద్ధతి కాదు అని బాబావారు మినూ పోహూవాలాకి చాలా స్పష్టంగా చెప్పారు. ఆ మాటలు కొంచెం కటువుగా వినిపించాయి. ఎంత పచ్చిగా చెప్పినా అర్థం కాకపోవచ్చునుకొన్నారో ఏమో మరి, బాబావారు వో ఉదాహరణ చెప్పారు.

భగవద్వేషణ మార్గాన్ని మంచి నీళ్ల బావి త్రవ్వటంతో పోల్చారు. మంచినీళ్ల బావిని త్రవ్వాలంటే ఏం చేయాలి. ఎక్కడ నీళ్ళు పడతాయో, జాగ్రత్తగా గమనించాలి. అప్పుడే, త్రవ్వటం మొదలుపెట్టాలి. అంతేకాని కాసేపు ఇక్కడ, ఇంకాసేపు అక్కడ అంటూ ఎక్కడ పడితే అక్కడ త్రవ్వుతూ పోతే వొళ్ళు హూనం అవుతుంది తప్ప నీళ్లు పడవు. ఏదో ఒకచోట స్థిరంగా వుండి, త్రవ్వుతూ పోతే, ఈ వేళ కాకపోతే రేపయినా నీళ్ళు పడతాయి. అయ్యో, నీళ్ళు పడలేదని కృంగిపోయినా, నాలుగుచోట్లకి పరుగెత్తినా ఫలితం శూన్యం. మనిషికి ధైర్యం కావాలి. పట్టిన పట్టు వదలుకూడదు. ఇలాగనే, భగవంతుడి విషయంలో కూడా ఈ స్వామి, ఆ ఋషి, ఆ గురువు, ఈ సద్గురువు అంటూ పరిగెడితే, లాభం వుండదు. ఎవరో ఒక గురువుని ఆశ్రయించు. ఆయన ఇచ్చ ప్రకారం చేయి. అలా చేస్తూపోతే గమ్యం చేరతావు. త్రవ్వగా త్రవ్వగా బావిలో నీళ్ళు పడ్డట్టు, గురువు సేవలో తరిస్తే, మంచి తీర్థం దొరికినట్లు, వో రోజున భగవత్ దర్శనం లభిస్తుంది అని బాబావారు మినూ పోహూవాలాకి ఆధ్యాత్మిక రహస్యాన్ని బాగా అర్థమయ్యేలా చెప్పారు.

ఆ తర్వాత కాసేపటికి సావన్ కోత్వాల్ కోసం కబురు పంపారు.

ఇతగాడు కుర్రాడు పాతికేళ్ళవాడు. ఉపాసనీ మహారాజ్‌ని, నారాయణ మహారాజ్‌నీ, హజరత్ బాబాజాన్‌నీ దర్శించాడు. ఆరంగావ్‌లో వున్న ఇరానీ గురువు బాబాజాన్ గారి ప్రధాన శిష్యుడని పూనాలో విన్నాడు. వెంటనే మెహెర్‌బాబా బాబా దర్శనానికి వచ్చాడు. బాబా సమక్షంలో వస్తూనే, మనస్సులోమాట చెప్పాడు. దేముడిని చూసి తరించాలని వుందన్నాడు ఆ మహద్భాగ్యం ఈ జన్మలోనే కలగాలి అన్నాడు. వో ప్రక్కన సాధకుడిగా మరో ప్రక్క సంసారిగా జీవించాలని వుందన్నాడు. కొత్వాల్‌కి పెళ్ళి అయింది అప్పటికే. అందుకనే అతను అలా చెప్పాడు. భార్యాబిడ్డలతో కలిసి వుండాలనుకొంటున్నా అన్నాడు.

బాబా వారు కోత్వాల్ మాటలని శ్రద్ధగా విన్నారు. హమ్మయ్య అని అతను వూపిరి తీసుకొన్నాడు. నా కోరిక తీరే రోజూ రాబోదున్నదనుకొన్నాడు. కానీ బాబావారి మాటలు విన్నాక కొంత హతాశుడయ్యాడు. బాబావారు ఏమన్నారు అంటే, నీ ఆధ్యాత్మిక తపన నాకు అర్థమయింది. గమ్యం వైపు త్వరగా వెడతావు. నీ లక్ష్యం నెరవేరుతుంది. నేను సహాయం చేస్తాను. అయితే ఇప్పుడు ఇంటికి వెళ్ళిపో. వారాంతంలో నా దగ్గరకి వస్తూండమన్నారు. సరే బాబా అన్నాడు కోత్వాల్. అలా అప్పటినుంచి బాబా దగ్గరకి రావటం మొదలు పెట్టాడు. బాబాతోపాటు వుంటున్న మండలిలో చేరాలన్న కోర్కె పుట్టింది.

సావక్ కోత్వాల్ ఉపాసనీ మహారాజ్‌ని దర్శించిన సంగతి పాఠకులకి తెలుసు కదా. అతగాడు మహారాజ్‌ని చాలా సార్లు దర్శించాడు. ఒకసారి బొంబాయిలో ఏమయిందీ, మహారాజ్ దర్శనం ఇస్తున్నారు. వొక్కక్కరు ఆయన దర్శనం చేసుకొంటున్నారు. అలా వరుసలో నడుస్తూ, కోత్వాల్ మహారాజ్ సన్నిధి చేరాడు. రెండు చేతులు జోడించి నమస్కరించబోతుంటే, మహారాజ్ చాచి లెంపకాయ కొట్టారు. అదిరిపోయాడు. ఏమయిందోనని బిత్తర చూపులు చూస్తుంటే, మహారాజ్ గద్దించారు. మొహంవాచేలా చివాట్లు పెట్టారు. నీకేమయింది నా యావత్తు పని ధ్వంసం చేశావు. నువ్వు నాశనమవుతున్నావన్నారు. బుర్ర తిరిగి పోయింది మన మిత్రుడికి. బుద్ధి వుండగా మళ్ళీ ఈయన దర్శనం చేస్తే వొట్టు అనుకొన్నాడు. కాస్సేపు అక్కడే తారట్లాడి, బయటకి కదిలాడు. కొంచెం దూరం వెళ్ళాడో లేదో మహారాజ్ శిష్యుడొకరు పరుగెడుతూ వచ్చాడు. మళ్ళీ ఏం ప్రమాదం ముంచుకొచ్చింది దేముడా అనుకొంటూంటే, ఆవచ్చినాయన భుజంతట్టి భయపడ వద్దన్నాడు. . మహారాజ్ వో మాట చెప్పమన్నాడన్నాడు.

నిన్ను వుత్తినే కొట్ట లేదుట. దానికి వో కారణం వుందట. నీ చెంప చెళ్ళుమనిపించడంతో ఆయన పని జరిగిందిట. నిన్ను గాబరాపడ(worry) వద్దని చెప్పమన్నారు అని చెప్పాడు. **ఓహో! అలాగా'** అనుకొన్నాడు కోత్వాల్.





మెహెర్‌బాబా దర్శనం చేశాక కూడా కోత్వాల్ పేరున్న సాధవులు, గురువుల దగ్గరకి వెళ్ళటం మానలేదు. అలా జియాగి బాబా గారిని కలిశాడొకసారి. వారి దర్శనంతో తరించాననుకొన్నాడు. దరిమలా కొన్ని రోజులకి మళ్ళీ మెహెర్ దర్బార్‌కి వచ్చాడు. అప్పుడు బాబావారు ఏమి చెప్పారో తెలుసా? జియాగీని వదిలేయి. ఆధ్యాత్మిక ప్రపంచపు సువాసనలు దరిదాపులకి కూడా అతగాడు చేరలేదు. కోటగుమ్మం దగ్గరి భటులకి వంగి వంగి నమస్కరించాల్సిన అవసరం చక్రవర్తి తెలిసిన వారికి లేదు అని సావిక్ కోత్వాల్‌కి వివరించారు.

బొంబాయిలో వున్న 'టిపుబాబా' ని కలవమన్నారు. అతను వో గొప్ప సాదువు. నా మాటగా చెప్పు చక్రవర్తి పంపించాడని చెప్పు అన్నారు.

కోత్వాల్ అలానే చేశాడు. టిపుబాబా సాధారణంగా పెదవి విప్పడు. ఎవరితోనూ మాట్లాడడు. అటువంటిది కోత్వాల్ మాట వింటూనే ఏమన్నాడో తెలుసా."దేముడు ఘనుడు. దేముని కంటే శ్రేష్ఠమైన వారు మరిలేదు. అల్లాహొ అక్బరు, అల్లాహొ అక్బర్ అని అను. ఇవేనా ఆశీస్సులు. పని పూర్తయింది జయప్రదంగా, ఫోనువ్వు ఇప్పుడు' అన్నాడు. ఈ సంఘటన జరిగినకొద్ది రోజులకి కోత్వాల్ మళ్ళీ మెహెరుని దగ్గరకి వచ్చాడు. టిపుబాబాని కలిసినందుకు సంతోషించారు. అతని దగ్గరకి అప్పుడప్పుడు వెళ్ళమనారు. ఇంకెవరి దగ్గరకీ వెళ్ళవద్దన్నారు.

అలా మెహెరుని ఆదేశం మేరకు సావక్ కోత్వాల్ గారు టిపుబాబా దగ్గరకి తరుచు వెడుతున్నారు. ఒకసారి మెహెరుని ఫోటోకి ఫ్రేమ్ కట్టించి తీసుకువెళ్ళాడు. ఈ ఫోటోని మీగదిలో పెడతానన్నాడు. ఆ స్వామి సరేనన్నాడు. గోడకి మేకుకొట్టి, ఫోటో వ్రేలాడదీశాక, టిపుబాబా అన్నమాటని కోత్వాల్ జీవితాంతం మరచి పోలేదు

మెహెర్‌బాబా పేరు చెప్పి యావత్తు ప్రపంచం నడుస్తోంది అన్నాడు ఆ సాధువు.

**- .సశేషం**

# ప్రాతః కాల బాబా సందేశాలు

బెంగుళూరులో ఉంటున్న బాబా ప్రేమికులు శ్రీ హరి మెహెర్ తెల తెల్లవారక ముందే ఉదయం 6 - 7 గంటల మధ్య బాబా సందేశాలను ఎస్.ఎం.ఎస్. ద్వారా బాబా ప్రేమికుల మొబైల్ ఫోన్లకు పంపుతున్నారు. మీరు ఆ సందేశాలను అందుకోవాలనుకుంటే మీ వివరాలు శ్రీ హరిమెహెర్‌కు 097380-46278, 088674-45627, 088674-45628 తెలియజేయవల్సింది.

# మెహెర్ గాన మంజరి సిడి విడుదల

శ్రీ సి.వై.చింతామణి విజయనగరం రూపొందించిన మెహెర్‌గాన మంజరి ఆడియో/విజువల్ సి.డిని అక్టోబర్ 23న అనంతపురం బాబా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రేమిక సహవాస్‌లో విడుదల చేయనున్నట్లు శ్రీ చింతామణి తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ బండారు చిట్టిబాబు ఈ సిడిలకు సంగీత దర్శకత్వం వహించారు.

సుమారు 11 పాటలతో రూపొందించిన ఈ సిడిలను ఆంధ్ర మెహెర్‌బాబా సెంటర్ ఆధ్వర్యంలో విడుదల చేయనున్నట్లు శ్రీ చింతామణి తెలిపారు.

# మెహెరాబాద్‌లో కంటి ఆపరేషన్లు

మెహెరాబాద్‌లోని మెహెర్ హెల్త్ సెంటర్‌లో కంటి ఆపరేషన్లు నిర్వహించడానికి ప్రతిపాదించిన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు పనులకు 2010 నవంబరు నెలలో శ్రీకారం చుట్టనున్నట్లు శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

సుమారు 05 లక్షల రూపాయలు ఖర్చు కాగల ఈ పనులకు పలువురు బాబా ప్రేమికులు ఇప్పటికే నాలుగు లక్షల రూపాయలకు పైగా విరాళాలు అందజేసినట్లు శ్రీ రావు అన్నారు. కాగా, కంటి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటులో తెలుగువారు ముందుండి తగిన ఆర్థిక సహాయం అందజేయవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సహాయం చేయగోరువారు, ఆంధ్రా రెస్ట్‌హౌస్ ఆన్‌లైన్ అకౌంట్ నెంబర్లు-సెక్రటరీ, ఆంధ్రా మెహెర్‌బాబా సేవాశ్రం సొసైటీ, మెహెరాబాద్ పేరు మీద, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వి.ఆర్.డి.ఐ బ్రాంచ్, ఆరంగాన్, ఎస్.బి.అక్కౌంట్ నెం.31057241962, బ్యాంకు ఐ.ఎఫ్.ఎస్.నెం. ఎస్.బి.ఐ.ఎన్.0010712. పంపి శ్రీ వై.ఎస్.రావు, కార్యదర్శి, ఆంధ్రా రెస్ట్‌హౌస్, మెహెరాబాద్, అడ్రస్సుకు తెలియజేయవల్సింది.

**ఈ నగదు ముట్టిన తర్వాత అహ్మద్‌నగర్‌లోని బాబావారి ట్రస్టుకు అందజేసి, వారిచ్చిన రశీదును సంబంధితులకు పంపగలమని శ్రీ వై.యస్. రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ వై.యస్. రావు ఫోన్- 09011751910 లేదా 9848111671 సంప్రదించగలరు. ❃**





# మిర్యాలగూడాలో ప్రేమక సహవాస్

2010 అక్టోబరు 7వ తేదీన బాబా అక్షర ఫలకం త్యజించిన రోజు.

ఆ రోజుననే బాబా మండలి సభ్యుడు శ్రీ బాలనాటు బాబాలో ఐక్యమయిన రోజు.

ఈ సందర్భంగా శ్రీ గోపగాని నర్సయ్య ఆధ్వర్యంలో బాబా ప్రేమిక సహవాస్ వేడుకగా జరిగింది. సహవాస్ కార్యక్రమాన్ని శ్రీ పి.ఎస్.కె.శర్మ, హైదరాబాద్ నిర్వహించారు.

ముందుగా శ్రీ నోరి హనుమంతరావు మాట్లాడుతూ మెహెర్‌బాబా ఇచ్చిన The True Aspect of Divinity చదివి వినిపించారు.

**అవతారుడు అర్హులకు, అనర్హులకూ అందరికీ అందుబాటులో వుంటాడని వివరించారు. అయితే అవతారుని దివ్యత్వాన్ని ఎవరైతే సరైన రీతిలో వీక్షించి అవగాహన చేసుకుంటారో వారు తప్పక తరిస్తారని శ్రీ నోరి అన్నారు.**

శ్రీ నోరి సూర్య నారాయణ, కోఠి సెంటర్ సేకరించి, సంకలనం చేసిన మెహెర్‌బాబా సందేశాలకు శ్రీ బి.రామక్రిష్ణయ్య వివరణ చెప్పారు. ఈ సమావేశంలో శ్రీ సీతారామస్వామి తదితరులు ప్రసంగించారు. శ్రీ కేశవరావు, (నర్సరావుపేట), రజిత, (మిర్యాలగూడా), భజన కీర్తనలు ఆలాపించారు. మాస్టర్ వేణు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది.

# పుట్టపర్తిలో మెహెర్ భజనలు

అనంతపురం జిల్లా పుట్టపర్తిలో సెప్టెంబర్ 25 ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు మెహెర్‌బాబా సత్సంగ్ కార్యక్రమాలు శ్రీ శ్రీనివాసరావు, శ్రీమతి నాగమణి గారింట్లో నిర్వహించినట్లు బాబా ప్రేమికులు శ్రీ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీ శ్రీనివాసరావు దంపతులు రాజమండ్రికి దగ్గర్లోని వెంగాయమ్మపురం గ్రామ వాస్తవ్యులు.

వ్యాపారరీత్యా పుట్టపర్తిలో కొన్నేళ్ళుగా స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రక్కన ఉంటున్నారని 'బాబా హొటలు' నిర్వహిస్తున్నారని శ్రీ శివ ప్రసాద్ తెలిపారు. వారి అభ్యర్ధనల మేరకు పుట్టపర్తిలో వారింట సత్సంగ్ ఏర్పాటు చేశామన్నారు.

అనంతపురం, హిందూపురం పావగడ ధర్మవరం సెంటర్‌ల నుండి విచ్చేసిన బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన అన్నారు.

# తీరిన చిన్ని కోరిక

**(మా ప్రతినిధి)**

శ్రీ గాంధీ- సింగనూర్, కర్నాటకలో స్థిరపడ్డారు.

వీరికి ఇటీవల హైదరాబాద్‌లో సెప్టెంబరు 2010లో గుండెకు ఆపరేషన్ (open heart surgery) చేశారు. ఆపరేషన్ పూర్తయి ఆసుపత్రి నుండి డిశ్చార్జయిన సుమారు రెండు వారాలకు, హైదరాబాద్‌లోనే విశ్రాంతి తీసుకుంటుంటే, మెహెర్‌బాబా హైదరాబాద్‌లో మనోనాశ్ కార్యక్రమం నిర్వహించిన ఖోజాగూడా ప్రాంతానికి తీసుకెళ్ళమని వారి బంధువులు ఆయన్ని కోరారు.

శ్రీ గాంధీ స్థానిక బాబా ప్రేమికులతో ఖోజాగూడా మార్గం అడిగి తెలుసుకుని అక్కడికి వెళ్ళారు. ఐతే, ఖోజాగూడాలో బాబా మనోనాశ్ కార్యక్రమం నిర్వహించిన ప్రాంతానికి శ్రీ గాంధీని ఆయన ఆరోగ్యరీత్యా అక్కడి దాకా వెళ్ళొద్దని ముందుగానే స్థానిక ప్రేమికులు హెచ్చరించారు.

కొండపై భాగాన కూడా దారి ఎగుడు-దిగుడు రాళ్లతో వుంటుందనీ, మనోనాశ్ గదిని చేరడం- శ్రీ గాంధీకి కష్టమనీ హెచ్చరించారు.

స్థానిక బాబా ప్రేమికుల హెచ్చరికల మేరకు ఆయన ఖోజాగూడా కొండ దిగువనే వారు వచ్చిన వాహనంలోనే కూర్చున్నారు.

వారి కుటుంబసభ్యులు మాత్రం బాబా మనోనాశ్ నిర్వహించిన ప్రాంతానికి వెళ్ళారు. ఇదిలావుంటే, ఓ నడివయస్సు వ్యక్తి తన వద్దకు వచ్చి, మెహెర్‌బాబా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు తన వయస్సు 5 సంవత్సరాలని చెప్పాడు. నేను ఆ సమయంలో మెహెర్‌బాబాను చూశాననీ చెప్పాడు. శ్రీ గాంధీని కొండపైభాగానికి సులువుగా తాను తీసుకెళ్తానని చెప్పి, తనని ఒప్పించి, బాబా మనోనాశ్ నిర్వహించిన చిన్న గది ప్రాంతానికి సునాయాసంగా తనను తీసుకెళ్ళి- తిరిగి కొండ క్రింద మా వాహనం దగ్గర దించాడని శ్రీ గాంధీ హైదరాబాద్‌లోని **మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధికి** చెప్పారు.

ఇది అవతారుని లీల అని, గుండె ఆపరేషన్ చేయించుకుని- విశ్రాంతిలో వున్న నేను కొండ పైభాగానికి బాబా ప్రేమికులు ముందుగా చెప్పినట్లు వెళ్లదల్చలేదు కానీ, నా మనస్సును గ్రహించిన అవతారుడు నాకు ఆ అవకాశం ఆ ఆగంతకుని రూపంలో బాబా కల్పించాడని కృతజ్ఞతతో- రెండు చేతులు జోడించారు శ్రీ గాంధీ.

**దైవం మానుష రూపేణా** అంటే ఇదేనేమో అని ఆయన అన్నారు. ❃





# దసరాకు మెగాటూర్

**(మా ప్రతినిధి)**



డా॥ విజయసారధి నేతృత్వంలో తాడేపల్లిగూడెం నుండి సుమారు 260 మంది పైబడి మెహెరాబాద్‌కు బాబా దర్శనార్థం ప్రయాణమ్యారు.

దసరా పండుగ సందర్భంగా అక్టోబరు రెండవ వారంలో- ఓ వారం రోజులపాటు బాబా సమక్షంలో గడపాలన్నది వారి ఆశయమని డా॥ విజయసారధి అన్నారు.

తాడేపల్లిగూడెం- చుట్టుప్రక్కల గ్రామాల నుండి సుమారు 260 మంది డా॥ విజయసారధితో మెహెరాబాద్‌కు ప్రయణమయ్యారు.

వీరి ప్రయాణ ఖర్చులు, భోజన, బస వసతులన్నింటితో కల్పి ఒక్కొక్కరికి రమారమిన రు.1800 వరకు ఖర్చు వస్తుందని అంచనా.

రైలు చార్జీలకే రు. ఒక లక్షా 79 వేల 300/- చెల్లించామని డా॥ సారధి అన్నారు

తాడేపల్లిగూడెం నుండి బయల్దేరే రైలులో ఏడు భోగీలలో టిక్కెట్లు రిజర్వుచేయించారు. అలాగే ఐదు బస్సులను ముందస్తుగా ఏర్పాటు చేసుకున్నారన్నారు.

మెహెరాబాద్‌లో సి/డి- హాస్టలులో వీరికి ట్రస్టు ప్రత్యేక వసతి కల్పిస్తున్నారు.

బాబా సమక్షంలో ఉండే వారం రోజుల్లో ఈ ప్రేమికులందరి కోసం ట్రస్టు చైర్మన్ శ్రీ భావూ కల్చూరీ ప్రత్యేక సందేశం ఇవ్వనున్నారు. అలాగే పలు విశేష సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కాగా, పట్టుమని పది మంది కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారే అనేక సిగపట్లు, పదనిసలు ఎదుర్కొంటారని ప్రతీతి.

డా॥ విజయసారధి చేపట్టిన ఈ మెగా యాత్ర నిజంగా సాహసమే మరి !!

అదే సమయంలో పలువురికి ఆదర్శం కూడా...

# పాత శ్రీకాకుళం సెంటర్ వార్షికోత్సవం

పాత శ్రీకాకుళం బాబా సెంటర్ 18వ వార్షికోత్సవం 2010 – అక్టోబరు 2న ఘనంగా నిర్వహింస్తున్నట్లు శ్రీ యు.వి.రమణమూర్తి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీ పి.ఎస్.ఆర్.బోసు, రాజమండ్రి, శ్రీ బాపిరాజు, ఏలూరు, శ్రీ కె. వెంకట్రావు, విశాఖ, తదితరులు పాల్గొంటున్నారని ఆయన అన్నారు.

# వివాహం

శ్రీమతి కె.వెంకటరత్నం, శ్రీ కె.ఎ.నారాయణ గార్ల ఏకైక పుత్రిక చి॥ల॥సౌ॥ కోమలి వివాహము చి॥గుణాకర్ (కిరణ్)తో నిద్దాం గ్రామంలో పెండ్లి కుమారుని స్వగృహములో 13.10.2010 బుధవారం రాత్రి గం॥12.05 ని॥లకు జరుపుతునట్లు మరియు వారి జ్యేష్ఠ పుత్రుడు చి॥ పూర్ణచంద్ర రావు వివాహము చి॥ల॥సౌ॥ హేమమ నళినితో, శ్రీకాకుళంనందు గల వై.ఎస్.ఆర్.కళ్యాణ మండపంలో 21.10.2010, గురువారం రాత్రి గం॥11.40 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# పుత్తూరులో నూతన బాబా సెంటర్

చిత్తూరు జిల్లా పుత్తూరు పట్టణంలో నూతన బాబా సెంటర్‌ను శ్రీ ఎం.రాంమూర్తిగారింట్లో ఆగస్టు 25న ప్రారంభించినట్లు బాబా ప్రేమికులు శ్రీ హనుమాన్ బాబా, కదిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగ్‌లో శ్రీయుతులు కిలారు నాగార్జున, శ్రీ శ్రీను బాబు, శ్రీ రాంకుమార్, శ్రీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గోరేగాంలో సత్సంగ్

ముంబాయికి సమీపంలోని గోరేగాం బాబా సెంటర్‌లో అక్టోబరు 2న చక్కని సత్సంగ్ నిర్వహించినట్లు ఆ కార్యక్రమానికి హాజరయిన శ్రీ సన్యాసిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతాప్ ఆహిర్ బాబా సందేశాలపై ప్రసంగించారు. తానుగా బాబా కీర్తనలు ఆలాపించానని శ్రీ సన్యాసిరాజు తెలిపారు. కాగా, ఈ ప్రాంతంలో ఉంటున్న పలువురు తెలుగువారు అధిక సంఖ్యలో హాజరవుతున్నట్లు ఆయన అన్నారు.





# నిర్యాణం

శ్రీ కోటి నాగేశ్వర రావు 28.09.2010 రాత్రి 12 గంటల ప్రాంతంలో తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు డా॥ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ నాగేశ్వరరావు 1954లో విజయవాడలో మెహెర్‌బాబాను దర్శించుకున్నారని నాటినుండీ అవతారుని సేవలో నిమగ్నమై వున్నారని డా॥ కేశవరావు అన్నారు.

# పావగడ బాబా సెంటర్ వ్యవస్థాపకులు మృతి

పావగడ బాబా సెంటర్ వ్యవస్థాపకులు శ్రీ రాజానాయుడు (89) 19.9.2010 ఆదివారం సాయంత్రం 5.20 ని॥లకు బాబాలో ఐక్యమయినట్లు స్థానిక సెంటర్ కార్యదర్శి శ్రీ వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. పావగడలో మెహెర్‌బాబా సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేయవలెనని శ్రీ రాజానాయుడు గారి చిరకాల కోరిక, చివరి కోరికగా ఆయన చెప్పేవారు. ఆ మేరకు 2009 సెప్టెంబర్ 19న పెద్ద ఎత్తున సహవాస్ కార్యక్రమం నిర్వహించి ఆయన మనసులోని కోరికను ఆనందంగా తీర్చుకున్నారు. కాగా, నాటి సహవాస్ కార్యక్రమం ఏర్పాటుచేసుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా 19.9.2010 నాడు పావగడలో ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసామని అదేరోజు బాబా నామస్మరణతో ఆయన బాబా లీనమైన ధన్యుడు అని శ్రీ నాగభూషణం అన్నారు.

# నిర్యాణం

హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీయుతులు టి.సత్యనారాయణ, మల్కాజిగిరి. శ్రీ లోకేశ్వరరావు వీరిద్దరు అక్టోబరు నెల మొదటి వారంలో బాబా నామజపం చేస్తూనే అవతారునిలో లీనమయ్యారని శ్రీ నోరి మెహెర్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు నిరంతరం బాబా నామజపంతో బాబా సేవలో నిమగ్నమై వుండేవారని ఆయన అన్నారు.

# క్విక్.. క్విక్.. ...

**మీ అడ్రస్సులో మార్పులూ చేర్పులూవున్నా, మీ సెంటర్ సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నా మాకు SMS పంపండి. మా మొబైల్ నెంబర్ 99595 53218.**

**ఇ మెయిల్–** krishnanandm@yahoo.com

**అలాగే ఆన్‌లైన్–www.srimeherbaba.com లో మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 20 తేదీన వీక్షించండి.**

# వాఁడ్రేవు బాబాలో ఐక్యం



శ్రీ వాడ్రేవు రామారావు (80) బాబాలో ఐక్యమయ్యారు.

అక్టోబరు 7 గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో శ్రీ రామారావు, మెహెరాబాద్‌లో తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన గత కొన్నేళ్ళుగా మెహెరాబాద్‌లోని బాబా సమాధి ప్రాంగణానికి దగ్గరల్లోనే నిర్మించుకున్న ఇంటిలో వుంటున్నారు. ఉదయం 7 గంటలకు మరియు సాయంత్రం 7 గంటలకు బాబా సమాధి దగ్గర జరిపే ప్రార్థనల సమయంలో ఠంచనుగా హాజరయి బాబా ప్రేమికులందరిని పేరు పేరున పలకరించే ఆత్మీయ బాబా ప్రేమికులు శ్రీ రామారావు మరిక కనబడరన్న విషయాన్ని ముఖ్యంగా తెలుగువారు జీర్ణించుకోలేక పోతున్నారు.

మెహెరాబాద్‌లో నిరాడంబరంగా ఉంటూ బాబా నామజపంలో, సేవలో గడుపుతున్న శ్రీ వాడ్రేవు రామారావు అవతారునికి సంబందించి ఎంతో అమూల్యమైన, అరుదైన సాహిత్యాన్ని సేకరించారు. ఆయనలో పఠనాశక్తి మెండు. వారి జ్ఞాపక శక్తి అపారం. బాబా సాహిత్యాన్ని ఆసాంతం ఆకళింపు చేసుకున్నవాడనాలి.

1920 వ దశకంలో మెహెర్‌బాబాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ఎం.ఎస్.ఇరానీ ప్రచురించిన పుస్తకం ఆయన సేకరించిన పుస్తక భండాగారంలో ఉంది.

ఈ పుస్తకాన్ని ఇటీవల ఆయన్ని కలిసిన డాక్టర్ కె. కేశవరావు, విజయవాడకు చూపించారు. అంతేకాదు, మెహెర్‌బాబా చేపట్టిన ఉపాసనీ మహారాజ్ జీవిత చరిత్ర రాస్తున్న సందర్భంలో సమాచార సేకరణకై సాకోరీకి వెళ్ళిన మండలి సభ్యుల అనుమానాలను నివృత్తి చేస్తూ ఎం.ఎస్. ఇరానీ పేరిట ఆనాడు బాబావారు పంపిన టెలిగ్రాం కాపీ నకళ్ళు సయితం శ్రీ వాడ్రేవు వద్ద భద్రంగా ఉన్నాయని ప్రొ॥ కేశవరావు గుర్తు చేసారు.

గొప్ప స్నేహశీలి, సాహిత్యాభిలాషి, విమర్శకుడు, అన్నింటికీమించి గొప్ప బాబా ప్రేమికుడైన శ్రీ వాడ్రేవ్ (భిలాస్‌పూర్) గారి ఆత్మకు శాంతి చేకూరాలని మెహెర్‌బాబా పత్రిక పాఠకులందరి పక్షాన అవతారుడిని వేడుకుంటున్నాం. **- ఎడిటర్.**





# శ్రీని బాబు క్రొత్త సి.డి.

చెన్నైలో వుండే శ్రీని బాబు ఇటీవల క్రొత్తగా రూపొందించిన ఆడియో, వీడియో సిడిలు సెప్టెంబరు 26న విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో బాబా ప్రేమికులందరి సమక్షంలో విడుదల చేశారు. రాష్ట్రంలో గల 40 బాబా సెంటర్లలో శ్రీ శ్రీని బాబు బృందం చేసిన గానామృతమే ఈ సిడిల్లోని ప్రధానాంశం. మెహెర్‌బాబా బాల్యం నుండీ సమాధి అయ్యే వరకూ అవతారుని సమగ్ర జీవిత చరిత్రను 40 చరణాలు గల గేయ రూపకంలో చక్కగా వివరించారు. ఒక్కొక్క పాట కోసం ఒక్కో బాబా సెంటర్‌ను, అక్కడి స్థానిక బాబా ప్రేమికులను బ్యాక్‌గ్రౌండులో చూపించారు. అలాగే, బాబావారి చలనచిత్రాలలోని కొన్ని క్లిప్పింగులను ఈ సిడిల్లో చొప్పించారు. ఏతావాతా ఇది బాబా ప్రేమికులకు శ్రీ శ్రీనిబాబు అందించిన ఓ క్రొత్త ప్రయోగం.

ఏది ఏమైనా శ్రీ శ్రీని బాబు ఈ సిడిల రూపకల్పనలో ఎంతో శ్రమ తీసుకున్నారనిపిస్తుంది. శ్రీకాకుళం మొదలుకుని చీపురుపల్లి, పాలకొండ, గుంటూరు, నరసరావుపేట, విజయవాడ, చల్లపల్లి, మచిలీపట్నం, హైదరాబాద్ దాకా ఇలా 40 సెంటర్లలో కార్యక్రమాలను నిర్వహించడం సామాన్యమైన విషయం కాదు. ఆధునిక పోకడలతో, చక్కని సౌండు రికార్డింగులలో రూపొందించిన అవతారుని జీవిత చరిత్రతో గల ఈ సిడిలు అందరి ప్రేమికుల ఇంట తప్పక వుండాల్సిందే. సిడిల కోసం **శ్రీ శ్రీని బాబు, 92 బి, నెహ్రూ వీధి, ఆల్వార్‌తి నగర్, చెన్నై - 87, ఫోన్.98411 - 95273** సంప్రదించగలరు.

# శ్రీ దుగ్యాల ప్రతిపాదన

అవతార్ మెహెర్‌బాబా 42 వ అమరతిథిలో, 31.1.2011కు విచ్చేసే బాబా ప్రేమికులలో అధిక శాతానికి అంటే సుమారుగా ఓ ఏడు వేల మందికి ఉచితంగా ఉదయం ఫలహారం, మధ్యాహ్న భోజనం అందించాలని ప్రతిపాదించినట్లు శ్రీ దుగ్యాల ప్రభాకర్ , తెట్టెకుంట సెంటర్, కరీంనగర్ జిల్లా ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి ఎ. రమాదేవి, వరంగల్లు, శ్రీమతి చీటి గీతారాణి, తెట్టెకుంట కార్యనిర్వాహకులుగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు. ఇందుకు కరీంనగర్ జిల్లాలో గల బాబా సెంటర్లు- తెట్టెకుంట అగ్రహారం, చంద్రంపేట, ఎల్లారెడ్డిపేట వారు తగిన ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన అన్నారు. ❀

*(గత సంచిక తరువాయి)*

# బాటసారులు

ఇటార్సీలో వారు కొన్ని గంటలు రైలు కోసం కనిపెట్టుకొని ఉండవలసివచ్చింది. స్టేషన్ దగ్గర గులాబ్‌బాబా జాల్ కాకా లిద్దరినీ పండుకొని నిద్రపోమ్మని చాలా చెప్పి చూశాడు. కాని బాబా వద్దకు తీసికొని వెళ్ళబడే మస్తుఎలా తప్పించుకోడానికి ప్రయత్నిస్తాడో కాకాకి బాగా తెలుసు. అందుచేత గులాబ్ బాబాతో "మీరే పండుకొని నిద్రపోవాలి. మేం కాదు" అన్నాడు గులాబ్ బాబా ఆ ప్రక్కనున్న గోడ కేసి తిరిగి దానితో భగవంతుడితో అంటున్నట్టు "వీడిని నా వెనకాలే పంపుతున్నావెందుకు? ఒక్క క్షణమైన నన్ను ఒక్కడిని వదలడు" అని ఇంకా ఏదో దూషణ చేశాడు. ఆ రైలు స్టేషన్‌లో దీని వలన అందరు ఇటు తిరిగి చూచే సరికి వాళ్ళు గులాబ్ బాబాను ఎరుగరుకనక కాకా జాల్‌లు అతడు పిచ్చి వాడండి అని వాళ్ళతో చెప్పి వాళ్ళని పంపేశారు.

జబ్బల్ పూరుకి తెల్లవారగట్ల 3 గం॥లకు వారు చేరుకున్నారు. మస్తు ఆశ్రమ ద్వారం ప్రవేశించగానే గులాబ్ బాబా "ఇది అతని ఆస్పత్రి" అన్నాడు.

ఉదయాన్నే గులాబ్ బాబాను చూచుటకు వచ్చేముందు బాబా ఆకుపచ్చ ఎరుపు, పసుపుపచ్చ మూడురంగులలో కొన్ని మిఠాయి ఉండలున్ను. కూర్చోడానికి ఒక చాప పంపేరు. గులాబ్‌బాబా "ఆయనచేత్తో ఇచ్చిన చాప మీద నేను కూర్చోను" అని మిఠాయిలు కూడ తినకుండా తోసేసేడు. కాని కాకా అతనికి నచ్చచెప్పి కొంచెం కొంచెం తినేలా చేసేడు.

కొంచెం సేపయిన తరువాత గదిలోనికి బాబా ప్రవేశించగా చూచి గులాబ్ బాబా కాకాతో "ఆయన స్వయంగా భగవంతుడే. నీవు నన్ను మాయ చేశావు" అన్నాడు. అప్పుడు బాబా చాపమీద కూర్చొని తన ప్రక్కను కూర్చొనమని గులాబ్ బాబాకు సైగ చేసేరు. "ఆయన ప్రక్కన కూర్చొనుటకు నేను తగను" అన్నాడు.

తరువాత మృదువుగా చెప్పగా కేశఖండన చేయించుకుని బాబాచేత స్నానం చేయించుకుని, అన్నం పెట్టించుకుని తిని, కొత్త బట్టలు కూడా తొడిగించుకున్నాడు గులాబ్‌బాబా. అతడు తలుపులు మూసివున్న గదిలో భోజనం చేస్తూ కొంతసేపటికి తలుపులు తెరుచుకొని బయటకు వచ్చి "నాకు దారి కనబడడం లేదు. నాకు కళ్ళు కనిపించడం లేదు" అని అరిచేడు. ఉద్రేకంలో వున్నప్పటికి కాకా అతనిని మెల్లిగా దువ్వి వెనక్కి తీసికొచ్చేడు. అప్పుడు బాబా అతనికి పూర్తిగా భోజనం పెట్టేరు. ఆ తరువాత కాకాని పిలిచి గులాబ్ బాబాను తిన్నగా ఎల్లిచ్చిపూర్ తీసికొని వెళ్ళమని ఆజ్ఞాపించేరు.





బస్‌స్టాండుకి వెళ్ళేదారిలో కాకాను తనతో వచ్చి అక్కడ వుండమని గులాబ్ బాబా కోరగా అందుల కతడు బాబా అనుజ్ఞలేనిదే తానట్ల వుండజాలనని చెప్పేను.

కొన్ని వారముల క్రిందట ఉజ్జయినిలో బాబా కలుసుకొనిన మస్తును ఉజ్జయిని నుండి జబ్బల్‌పూరుకు ఛగన్ తీసికొని వచ్చెను.

అతనిని ఏమని పిలిచేవారో ఎవరికీ జ్ఞాపకం లేదు. కాని ఆతడొక ముఖ్యమైన ఆరవ భూమికకు చెందిన వున్నతస్థాయిలోని మస్తు. ఉజ్జయినిలో జనసమ్మర్దంగా వున్న వీధిలో మొదటచూసినవారు ఆతనిని మరువజాలరు. కొంచెం లావుగా 50 సంవత్సరములు వయసుగల మనిషి, గోచీ గుడ్డతప్ప దిగంబరుడు. రోడ్డు ప్రక్కన చిరిగిపోయిన గుడ్డలు, కాగితం ముక్కలు మూడు అడుగుల యెత్తుని ప్రోగు చేసుకుని కూర్చొని యుండెను. అందులో నుండి పాత గుడ్డలు తీసి చింపుచుండెను. ఆ దారే వెడుతూ బాబా కారు ఆపేరు. తన మండలికి అతనిని చూపించి "చాలా అభివృద్ధి పొందిన మస్తు" అని చెప్పేరు. ఒక రూపాయి అతనికిచ్చి రమ్మని కూడా పంపేరు.

తన ఆశ్రమానికి బయట యెక్కడయినా బాబా మస్తు నెవరినైనా చూచినప్పుడు మూడు పనులు చేస్తారు– పైకి కనిపించినంత వరకు మూడు పనులు– అంటే ఆంతరంగికంగా యేమేమి చేస్తారో యెవరికీ తెలియదు. ఆతనికి ఒక లోహపు నాణెం యిస్తారు. లోహం వలన బాబాతో అతనికి సంబంధం ఏర్పడుతుంది. అతనికి భోజనం పెడతారు. వీలయితే కొంచెం సేపు దగ్గరలో ఎక్కడయినా సౌకర్యంగా వున్నచోట అతనితో ఏకాంతంగా కూర్చుంటారు. మౌనం ఆరంభించినప్పటి నుండి మస్తుల కిచ్చినప్పుడు తప్ప బాబా డబ్బును ముట్టలేదు ఇక్కడ యితని విషయంలో మాత్రం ఒక నాణెం యింకొకరిచే పంపించినా అందువలన బాబాతో సంబంధం కలిగిందని ఊహించవచ్చును.

జబ్బల్‌పూర్ ఆశ్రమంలో ఈ ఉజ్జయిని మస్తు పది రోజులపాటు వున్న తరువాత అతనితో బాబా పని ముగించగానే ఛగన్ మరల అతనిని ఉజ్జయినికి తీసికొని వెళ్ళెను

ఖాలామాసి అని ఒక వృద్ధురాలు. ఆవిడ చాలా ఉన్నతమైన మస్తానీ, జబ్బల్‌పూరుకి 5 మైళ్ళ నైరుతిగా వున్న సియోనీ నుండి ఛగన్ తీసుకువెచ్చును. ఆమె బాబా యొక్క ఆధ్యాత్మిక వైభవోన్నతిని గుర్తించినట్లున్నది. ఆమె బాబాను చూడగానే లేచి నిలబడి ప్రేమతో ఆయనను ఆలింగిన మొనర్చి తన చేతులతో తన కణతలను నొక్కుకున్నది. ఈ విధంగా స్త్రీ తన ప్రేమను తెలుపుకొనుట మాములు. బాబా ఆమెను స్నానం చేయించి నూతన వస్త్రముల కట్టనిచ్చి భోజనం తినిపించేరు. ఆమె ఆయన కొంతసేపు యేకాంతంగా కూర్చున్నారు. ఆమె బాబాతో "నీవు మహాసముద్రుడవు. నాకు కొన్ని బిందువులు త్రాగుటకు ఈయవా" అనెను.

**– సశేషం**

# జీవిత సభ్యత్వం

## 2010 జూలై- ఆగస్టు నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | అక్టోబకు 10 | సత్తివీరెడ్డి, కుంకుందురు, తూ.గో.జి | రు. 1000.00 |
| 2. | అక్టోబకు 10 | పి.శ్రీధరరావు, సిద్ధిపేట్ | రు. 500.00 |
| 3. | అక్టోబకు 10 | ఎస్. సత్యన్నారయణమూర్తి, గుంటూర్ | రు. 1000.00 |
| 4. | అక్టోబకు 10 | పి.సుధా, చోడవరం, విశాఖజిల్లా | రు. 1000.00 |
| 5. | అక్టోబకు 10 | త్రినాథ రథో, విశాఖపట్నం | రు. 1000.00 |
| 6. | అక్టోబకు 10 | ఎం.శంకరప్ప, సంగారెడ్డి | రు. 1000.00 |
| 7. | అక్టోబకు 10 | మెహెర్‌కుమార్, విజయవాడ | రు. 600.00 |
| 8. | అక్టోబకు 10 | గోవిందరావు, హైదరాబాద్ | రు. 500.00 |
| | | మొత్తం | **రు. 6600.00** |

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/-

5) మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది. 6) బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

మా అడ్రస్: **ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
**యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500 087,**
**ఫోన్: 99595-53218.**





# ప్రభుస్తుతి

### ప్రభుస్తుతి

ఓ పర్వద్విగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట వున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకములలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురామజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.